పత్రికతో.. మార్పులు

APTEL/25/A1880

# TN తెలుగు న్యూస్

దిన పత్రిక

మా కలం మీ గళం.. సామాన్యుని గుండె చప్పుడు..

సంపుటి : 1 సంచిక : 705 పబ్లిషర్స్ & చీఫ్ ఎడిటర్ : యన్. కృష్ణారావు ఎడిటర్ : ఎస్. మస్తాన్ బుధవారం 02.09.2026 పేజీలు : 8 వెల : 4/-

### బటన్ నొక్కడం కాదు..

# ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు ఇస్తున్నాం

**మొగల్తూరులో చంద్రబాబు**

- పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని వెల్లడి
- మహిళా సాధికారతకు పెద్దపీట వేస్తూ, డ్వాక్రా సంఘాలకు ప్రోత్సాహం అందిస్తామని హామీ
- నదుల అనుసంధానం ద్వారా రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేయడమే తన ఆశయమని స్పష్టీకరణ
- పెట్టుబడులను ఆకర్షించి యువతకు ఉపాధి అవకాశాలు కల్పిస్తామని భరోసా




అమరావతి, సెప్టెంబర్ 1 : “గత పాలకులు బటన్ నొక్కి చేతులు దులుపుకొన్నారు, రోడ్ల నిండా గుంతలు పెట్టారు. కానీ మేం అలా కాదు.. ప్రతి అవ్వాతాత ఇంటికి వచ్చి వారికి గౌరవంగా పెన్షన్ అందిస్తున్నాం” అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. పేదల ఆర్థిక సాధికారతే లక్ష్యంగా తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలన అనే మూడు సూత్రాలతో ముందుకు సాగుతోందని ఆయన పునరుద్ఘాటించారు. పశ్చిమ గోదావరి జిల్లా నర్సాపురం నియోజకవర్గంలోని మొగల్తూరులో మంగళవారం నిర్వహించిన ‘పేదల సేవలో ప్రజా వేదిక’ కార్యక్రమంలో భాగంగా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ల పంపిణీని ఆయన ప్రారంభించి ప్రసంగించారు.

తరువాయి 2లో



## అక్షర ఆంధ్రకు అద్భుత ఫలితాలు

- వచ్చే సెప్టెంబరుకు 100 శాతం అక్షరాస్యత: మంత్రి నారా లోకేశ్
- పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖలపై మంత్రి నారా లోకేశ్ సమీక్ష
- వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధనకు పక్కా ప్రణాళికలు
- అక్షర ఆంధ్ర కార్యక్రమంతో ఏడాదిలో 25 లక్షల మందికి అక్షరజ్ఞానం
- బడిబయట ఉన్న 1.64 లక్షల మంది పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఆదేశం
- మధ్యాహ్న భోజనంపై ఫీడ్‌బ్యాక్ ఇవ్వాలని తల్లిదండ్రులకు, టీచర్లకు సూచన
- ఇంటర్ విద్యార్థులకు ‘తల్లికి వందనం’ కింద రూ.1051 కోట్ల ఆర్థిక సాయం

2లో

### కోటికి చేరువైన

## ‘ఇంటింటికీ తెలుగుదేశం-2026’

- 37వ రోజుకు చేరిన ‘ఇంటింటికీ తెలుగుదేశం’ కార్యక్రమం
- ఇప్పటివరకు 97 లక్షలకు పైగా ఇళ్లను సందర్శించిన టీడీపీ శ్రేణులు
- రెండేళ్ల పాలనపై ప్రజల నుంచి ఫీడ్‌బ్యాక్ సేకరణ
- కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన
- మంగళవారం ఒక్కరోజే లక్షన్నరకు పైగా ఇళ్ల సందర్శన

2లో






2లో

### హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి యూనివర్సిటీలు..

## ఇక ఇక్కడే గ్లోబల్ విద్య!

- హైదరాబాద్‌లో లండన్, నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీల క్యాంపస్‌లు
- భారత్‌లో తొలిసారిగా హైదరాబాద్‌లోనే వాటి ఏర్పాటు
- గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా మార్చే దిశగా తెలంగాణ ప్రభుత్వ చర్యలు
- హార్వర్డ్ వర్సిటీ సైతం కోర్సులు అందించేందుకు ఆసక్తి

### పాక్ ప్రధాని ముందే

## ఉగ్రవాదంపై మోదీ కీలక వ్యాఖ్యలు!



- ఎస్‌సీఓ వేదికగా ఉగ్రవాదంపై మోదీ ప్రసంగం
- ఉగ్రవాదానికి డబుల్ స్టాండర్డ్స్ ఉండకూడదని స్పష్టీకరణ
- టెర్రరిజాన్ని విధానంగా వాడే దేశాలకు గట్టి సందేశం ఇవ్వాలని పిలుపు
- ఉగ్రవాదం ఎవరికీ వ్యూహాత్మక ఆయుధం కారాదని స్పష్టీకరణ
- పాక్ ప్రధాని షరీఫ్ సమక్షంలోనే మోదీ ఘాటు వ్యాఖ్యలు

2లో

## బంగారం కొనొద్దు.. స్వదేశీ వస్తువులే వాడండి

### దేశ ప్రజలకు మోదీ పిలుపు



- భారత్ జీడీపీలో 7.8 శాతం వృద్ధి
- స్వదేశీ వస్తువులకు ప్రాధాన్యం ఇవ్వాలన్న మోదీ
- విదేశీ ప్రయాణాలు తగ్గించాలని సూచన
- విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్స్ వద్దని పిలుపు
- అవసరం లేకపోతే బంగారం కొనొద్దని సూచన

2లో

### వెలిగొండ ప్రాజెక్టు కోసం

## గళమెత్తిన గజల్ శ్రీనివాస్

3లో

### నేపాల్ విపత్తును ముందే పసిగట్టిన ‘నైసర్’ శాటిలైట్..

# విమర్శల్లో పసలేదు!

- నేపాల్ విపత్తుపై ముందే కీలక డేటా అందించిన ‘నైసర్’ శాటిలైట్
- విమర్శల నేపథ్యంలో వెలుగులోకి వచ్చిన వాస్తవాలు
- కొండచరియల్లో మార్పులను వారాల ముందే గుర్తించిన రాడార్
- చైనా పరిశోధకుడి విశ్లేషణలో కీలక విషయాల వెల్లడి
- ఇస్రో-నాసా సంయుక్తంగా అభివృద్ధి చేసిన శక్తిమంతమైన ఉపగ్రహం నైసర్



నేపాల్‌లో ఇటీవల సంభవించిన ఘోర విపత్తు నేపథ్యంలో, ఇస్రో నాసా సంయుక్తంగా రూపొందించిన ‘నైసర్’ ఉపగ్రహం పనితీరుపై వచ్చిన విమర్శలు నిరాధారమని తేలింది. విపత్తును ముందుగా హెచ్చరించడంలో ఈ శక్తిమంతమైన శాటిలైట్ విఫలమైందన్న ఆరోపణలను తాజా విశ్లేషణలు పటాపంచలు చేశాయి. విపత్తు సంభవించడానికి కొన్ని వారాల ముందే నైసర్ స్పష్టమైన హెచ్చరిక సంకేతాలను పంపిందని వెల్లడైంది. చైనాలోని చాంగాన్ యూనివర్సిటీకి చెందిన పరిశోధక విద్యార్థి జెన్‌షియాంగ్ లియు, నైసర్ చిత్రాలను విశ్లేషించి ఈ కీలక

తరువాయి 2లో

## నేపాల్ వరదలు..

### విదేశీయుల మృతదేహాల గుర్తింపుపై కీలక ప్రకటన

- మృతదేహాల అప్పగింతకు అధికారిక ప్రక్రియను విడుదల చేసిన నేపాల్ ప్రభుత్వం
- గుర్తుపట్టలేని మృతదేహాలకు డీఎన్ఏ పరీక్షలు తప్పనిసరి అని వెల్లడి
- సహాయం కోసం హెల్ప్‌లైన్ నంబర్లను ప్రకటించిన భారత రాయబార కార్యాలయం
- బాధితుల బంధువులు డీఎన్ఏ నమూనాలు పంపాలని సూచన

2లో



# బటన్ నొక్కడం కాదు.. ఇంటింటికీ వెళ్లి పెన్షన్లు ఇస్తున్నాం

(మొదటిపేజీ తరువాయి)

గత ప్రభుత్వ హయాంలో పెన్షన్ల కోసం వృద్ధులు, దివ్యాంగులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సిన దుస్థితి ఉండేదని, తమ ప్రభుత్వం ఆ విధానానికి స్వస్తి పలికిందని చంద్రబాబు అన్నారు. వాలంటీర్ వ్యవస్థను దుర్వినియోగం చేసిన గత పాలకుల తీరును ఆయన తప్పుబట్టారు. ఇప్పుడు తాము నేరుగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి, పెంచిన పెన్షన్లను అందిస్తూ వారి ఆత్మగౌరవాన్ని నిలబెడుతున్నామని తెలిపారు. ఈ సందర్భంగా తన రాజకీయ ప్రస్థానాన్ని గుర్తుచేసుకున్న చంద్రబాబు, 31 ఏళ్ల క్రితం ఇదే రోజు (సెప్టెంబరు 1) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా తొలిసారి ప్రమాణస్వీకారం చేశానని, అప్పటి నుంచి ప్రజా చైతన్యం, ప్రజా భాగస్వామ్యమే ధ్యేయంగా పనిచేస్తున్నానని తెలిపారు. ఇప్పటివరకు పెన్షన్ల రూపంలో రూ.73,507 కోట్లు అందించామని, గత రెండేళ్లలో సంక్షేమ పథకాల కోసం రూ.1.50 లక్షల కోట్లు ఖర్చు చేశామని వివరించారు.

*** మహిళా సాధికారత నుంచి సామాజిక న్యాయం వరకు**

మహిళా సాధికారతకు తమ ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని చంద్రబాబు అన్నారు. పొదుపు ఉద్యమానికి శ్రీకారం చుట్టిన డ్వాక్రా సంఘాల ద్వారా మహిళలను ఆర్థికంగా నిలబెట్టామని, ఇప్పుడు 'దీపం 2.0' పథకం ద్వారా ప్రతి పేద కుటుంబానికి ఏడాదికి మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు అందిస్తున్నామని తెలిపారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించి వారిని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుపుతున్నామని చెప్పారు. గత ఏడాది లక్ష మంది డ్వాక్రా మహిళలు ఎంఎస్ఎంఈలుగా ఎదిగారని, ఈ లక్ష్యాన్ని మరింత పెంచుతామని, వారు తయారు చేసే ఉత్పత్తులకు 'స్వయం' బ్రాండ్‌తో మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అలాగే 'స్త్రీశక్తి' కార్యక్రమం ద్వారా ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించి వారిపై ఆర్థిక భారం తగ్గించామని అన్నారు. సంక్షేమం అంటే కేవలం డబ్బులు పంచడం కాదని, అన్ని వర్గాల ప్రజలను అభివృద్ధిలోకి తీసుకురావడమేనని సీఎం పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల్లో ఇంకా ఉన్న వెనుకబాటుతనాన్ని రూపుమాపేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా వడ్డెర్లకు మైనింగ్‌లో, గీత కార్మికులకు మద్యం దుకాణాల్లో రిజర్వేషన్లు కల్పించామని, మత్స్యకారులకు వేట నిషేధ సమయంలో రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తున్నామని తెలిపారు. చేనేత కార్మికులకు ఉచిత విద్యుత్ ఇస్తున్నామని, దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణను అమలు చేసి సామాజిక న్యాయం చేశామని గుర్తుచేశారు.

**అభివృద్ధి, సాంకేతికతతో నవశకం**

నదుల అనుసంధానంతో రాష్ట్రంలో నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కరవు నేలకు కృష్ణా జలాలు అందించామని, శ్రీశైలం నుంచి మార్కాపురం వరకు నీళ్లు పారించడం తన జీవితంలో ఎనలేని ఆనందాన్ని ఇచ్చిందన్నారు. రేపు గోదావరి జలాలను ఉత్తరాంధ్రకు తరలించబోతున్నామని, గోదావరి నీటిని అనకాపల్లి, విశాఖ మీదుగా వంశధార వరకు తీసుకెళ్తామని ప్రకటించారు. గత పాలకులు పరిశ్రమలను తరిమేసి యువత భవిష్యత్తును అంధకారం చేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం పెద్ద ఎత్తున పెట్టుబడులను ఆకర్షిస్తోందని, విద్యుత్ సంస్థలను సమర్థంగా నిర్వహిస్తూ 'ట్రూ డౌన్' ద్వారా ఛార్జీల భారాన్ని తగ్గించామని తెలిపారు. ఆక్వా రైతులకు యూనిట్ విద్యుత్‌ను కేవలం రూ.1.5కే అందిస్తున్నామని, ప్రపంచ మార్కెట్లో ఏపీ ఆక్వా ఉత్పత్తులను అగ్రస్థానంలో నిలుపుతామని అన్నారు. ప్రజా పాలనలో సాంకేతికతను విరివిగా ఉపయోగిస్తామని, ఏఐ ట్యూటర్, ఏఐ డాక్టర్ వంటి వ్యవస్థలను ప్రజలకు అందుబాటులోకి తెస్తామని, 1.60 కోట్ల కుటుంబాలకు ఆన్‌లైన్‌లోనే ప్రభుత్వ సేవలు అందించే వ్యవస్థను రూపొందిస్తామని వెల్లడించారు. నర్సాపురం అభివృద్ధికి ఆక్వా కల్చర్ యూనివర్సిటీ, డంప్ యార్డు, డెల్టా ఆధునికీకరణ పనులు చేపడతామని హామీ ఇచ్చారు.

*** ఏకగ్రీవాలు వద్దనడం వారి ఓటమి భయానికి నిదర్శనం**

రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా ఎన్డీఏ కూటమిదే విజయమని చంద్రబాబు ధీమా వ్యక్తం చేశారు. ఓటమి భయంతోనే 'గొడ్డలి పార్టీ' స్థానిక సంస్థల ఎన్నికలు జరగకుండా అడ్డుకునేందుకు కుట్రలు చేస్తోందని ఆరోపించారు. ఏకగ్రీవాలను వద్దనడం వారి ఓటమి భయానికి నిదర్శనమని, గతంలో ప్రభుత్వాలే ఏకగ్రీవాలను ప్రోత్సహించాయని గుర్తుచేశారు. ఆయారాంగయారాంలను అరికట్టేందుకు మేయర్, చైర్మన్ ఎన్నికలను ప్రత్యక్ష పద్ధతిలో పెట్టామని తెలిపారు. బీసీ రిజర్వేషన్లను కూడా తగ్గించి ఆ వర్గాలకు అన్యాయం చేశారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, ఉపసభాపతి రఘురామ కృష్ణంరాజు, కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, విప్ బొలిశెట్టి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కోటికి చేరువైన 'ఇంటింటికీ తెలుగుదేశం–2026'

తెలుగుదేశం పార్టీ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'ఇంటింటికీ తెలుగుదేశం - 2 ఏళ్ల నమ్మకం - అభివృద్ధి, సంక్షేమం' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా కొనసాగుతోంది. మంగళవారం నాటికి ఈ కార్యక్రమం 37వ రోజుకు చేరుకుంది. ఇప్పటివరకు పార్టీ నాయకులు, కార్యకర్తలు రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 97.32 లక్షల ఇళ్లను సందర్శించి, కోటి ఇళ్ల సందర్శన లక్ష్యానికి చేరువయ్యారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా, ఈ రెండేళ్లలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించడం, ప్రభుత్వ పనితీరుపై వారి అభిప్రాయాలను నేరుగా తెలుసుకోవడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఒక్కరోజే రాష్ట్రవ్యాప్తంగా 1,52,172 ఇళ్లను టీడీపీ శ్రేణులు సందర్శించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ప్రతి గడప తట్టి, కుటుంబ సభ్యులతో నేరుగా సంభాషిస్తున్నారు. రైతులు, మహిళలు, యువత, పేదలు, మధ్యతరగతి వర్గాలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల ప్రయోజనాలను, అభివృద్ధి కార్యక్రమాల వివరాలను తెలియజేస్తున్నారు. అదే సమయంలో, క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకుంటూ, వారి అభిప్రాయాలను నమోదు చేసుకుంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుంచి ఈ కార్యక్రమానికి విశేష స్పందన లభిస్తోందని, ప్రజలు కూడా స్వచ్ఛందంగా పాల్గొంటున్నారని టీడీపీ నాయకులు చెబుతున్నారు. ఈ స్పందనతో మరింత ఉత్సాహంగా కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళుతున్నట్లు వారు పేర్కొన్నారు.

## హైదరాబాద్‌కు ప్రపంచ స్థాయి యూనివర్సిటీలు

హైదరాబాద్ నగరం గ్లోబల్ నాలెడ్జ్ హబ్‌గా ఎదిగే క్రమంలో మరో కీలక మైలురాయిని అధిగమించింది. బ్రిటన్‌కు చెందిన ప్రతిష్ఠాత్మక 'యూనివర్సిటీ ఆఫ్ లండన్', అమెరికాలోని బోస్టన్‌కు చెందిన 'నార్త్ ఈస్టర్న్ యూనివర్సిటీ' తమ ఆఫ్‌షోర్ క్యాంపస్‌లను హైదరాబాద్‌లో నెలకొల్పనున్నాయి. ఈ రెండు అంతర్జాతీయ విశ్వవిద్యాలయాలు భారత్‌లో తమ క్యాంపస్‌లను ఏర్పాటు చేయడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు నేతృత్వంలోని 'తెలంగాణ రైజింగ్' ప్రతినిధి బృందం బ్రిటన్‌లో పర్యటించిన సంగతి తెలిసిందే. అయితే, రేవంత్ అమెరికా పర్యటనకు కేంద్రం అనుమతి ఇవ్వకపోవడంతో, అధికారుల బృందం అగ్రరాజ్యంలో పర్యటించింది. ఈ పర్యటనల్లో భాగంగా నిర్వహించిన ఉన్నత స్థాయి చర్చలు సఫలీకృతం కావడంతో, ఈ ప్రఖ్యాత విద్యాసంస్థలు హైదరాబాద్‌లో తమ కార్యకలాపాలను ప్రారంభించేందుకు అంగీకరించాయి. వీటితో పాటు, ప్రపంచ ప్రఖ్యాత హార్వర్డ్ విశ్వవిద్యాలయం సైతం తెలంగాణలో స్వల్పకాలిక 'ఎగ్జిక్యూటివ్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లు', విభిన్న కోర్సులను అందించేందుకు ఆసక్తి కనబరిచినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఆక్స్‌ఫర్డ్, కేంబ్రిడ్జ్, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్, మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ వంటి అగ్రశ్రేణి విద్యాసంస్థలతో జరిపిన చర్చలు కూడా ఫలవంతమయ్యాయి. ఈ పరిణామంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

## పాక్ ప్రధాని ముందే ఉగ్రవాదంపై మోదీ కీలక వ్యాఖ్యలు!

ఉగ్రవాదంపై భారత్ వైఖరిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరోసారి స్పష్టం చేశారు. ఉగ్రవాదాన్ని విధానంగా ఉపయోగించే దేశాలకు గట్టి సందేశం ఇవ్వాలని అన్నారు. ఉగ్రవాదం ఎవరికీ వ్యూహాత్మక ఆయుధం కారాదని తేల్చి చెప్పారు. కిర్గిజిస్థాన్‌లోని బిష్కెక్‌లో మంగళవారం జరిగిన షాంఘై సహకార సంస్థ (ఎస్‌సీఓ) రౌండ్‌టేబుల్ చర్చలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశానికి పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్‌తో పాటు చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ సహా పలువురు దేశాధినేతలు హాజరయ్యారు. ఉగ్రవాదం విషయంలో ఎలాంటి ద్వంద్వ వైఖరికి అవకాశం ఉండకూడదని మోదీ అన్నారు.

## బంగారం కొనొద్దు.. స్వదేశీ వస్తువులే వాడండి

దేశ ఆర్థిక వ్యవస్థ 7.8 శాతం వృద్ధి సాధించిన నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రజలకు కీలక పిలుపునిచ్చారు. స్వదేశీ వస్తువులు, సేవలకు ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. అవసరం లేని విదేశీ ప్రయాణాలకు దూరంగా ఉండాలని సూచించారు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్స్ నిర్వహించొద్దని చెప్పారు. అవసరం లేకపోతే బంగారం కొనుగోలు చేయొద్దని విజ్ఞప్తి చేశారు. కిర్గిజిస్థాన్ నుంచి మంగళవారం ఉదయం ఇన్‌స్టాగ్రామ్ ద్వారా విడుదల చేసిన వీడియోలో మోదీ ఈ వ్యాఖ్యలు చేశారు. ఏప్రిల్‌జూన్ త్రైమాసికంలో దేశ జీడీపీ 7.8 శాతం పెరిగిందని సోమవారం విడుదలైన గణాంకాలు వెల్లడించాయి. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, సంక్షోభాలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు ఉన్నా భారత్ వేగంగా ముందుకు సాగుతోందని ప్రధాని అన్నారు. "విదేశీ దేశాలకు పర్యటనల కోసం వెళ్లొద్దు. విదేశాల్లో డెస్టినేషన్ వెడ్డింగ్స్ నిర్వహించొద్దు. 'వెడ్ ఇన్ ఇండియా' నినాదాన్ని పాటిద్దాం. అవసరం లేకపోతే బంగారం కొనొద్దు" అని మోదీ సూచించారు. స్వదేశీ వస్తువులు, సేవలను ఎక్కువగా ఉపయోగిస్తే దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమవుతుందని చెప్పారు. భారత్ స్వావలంబన సాధిస్తే స్వాతంత్ర్యం వచ్చిన 100 ఏళ్ల నాటికి అభివృద్ధి చెందిన దేశంగా మారుతుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేశారు. అంతర్జాతీయ సంక్షోభాల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఈ ఏడాది మేలోనూ మోదీ ప్రజలకు పలు సూచనలు చేశారు. అవసరమైన చోట 'వర్క్ ఫ్రమ్ హోమ్', ప్రజా రవాణా వినియోగం పెంచాలని కోరారు. పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించాలని, ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాలని సూచించారు.

## అక్షర ఆంధ్రకు అద్భుత ఫలితాలు.. వచ్చే సెప్టెంబరుకు 100 శాతం అక్షరాస్యత

రాష్ట్రంలో విద్యావ్యవస్థను బలోపేతం చేసి, సంపూర్ణ అక్షరాస్యత సాధించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. 'అక్షర ఆంధ్ర' కార్యక్రమం ఉద్యమంలా సాగుతోందని, దీని ద్వారా వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి రాష్ట్రాన్ని వంద శాతం అక్షరాస్యత సాధించిన రాష్ట్రంగా నిలపాలని అధికారులకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఉండవల్లిలోని తన నివాసంలో మంగళవారం పాఠశాల విద్య, ఇంటర్మీడియట్ విద్య శాఖల ఉన్నతాధికారులతో మంత్రి నారా లోకేశ్ సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా విద్యావ్యవస్థలో చేపడుతున్న సంస్కరణలు, కార్యక్రమాల పురోగతిని ఆయన సమీక్షించారు. ఈ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ మాట్లాడుతూ... 2024 నాటికి రాష్ట్ర అక్షరాస్యత శాతం కేవలం 72.6 శాతంతో దేశంలోనే అట్టడుగున ఉందని, అయితే గత ఏడాదిగా కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో కేవలం ఒక్క ఏడాదిలోనే 25 లక్షల మంది నిరక్షరాస్యులు అక్షరాస్యులుగా మారారని తెలిపారు. ఈ కృషిని కేంద్ర ప్రభుత్వం కూడా అభినందించిందని అధికారులు మంత్రి దృష్టికి తీసుకురాగా, ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇటీవల కేంద్రం విడుదల చేసిన వయోజన విద్య పరీక్షా ఫలితాల్లో రాష్ట్ర అక్షరాస్యత శాతం 10 శాతం పెరిగి 82.1 శాతానికి చేరుకుందని, ఇదే స్ఫూర్తితో 2027 సెప్టెంబర్ నాటికి సంపూర్ణ అక్షరాస్యత సాధించాలని కోరారు. ఇందుకు అనుగుణంగా 2027 మార్చి నాటికి మరో 25 లక్షల మందిని, ఆపై సెప్టెంబర్ నాటికి మిగిలిన 27 లక్షల మందిని అక్షరాస్యులుగా మార్చేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు అధికారులు వివరించారు. 11 ప్రభుత్వ శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తామని తెలిపారు. ఈ బృహత్ కార్యక్రమంలో స్థానిక శాసనసభ్యులు, ప్రజాప్రతినిధులను భాగస్వాములను చేసి, ప్రజల్లో విస్తృత చైతన్యం తీసుకురావాలని మంత్రి నారా లోకేశ్ సూచించారు.

*** బడిబయట పిల్లలందరినీ బడిలో చేర్పించాలి**

పాఠశాల విద్యపై సమీక్షిస్తూ, రాష్ట్రంలో బడిబయట ఉన్న 1,64,821 మంది పిల్లలను గుర్తించి, వారందరినీ పాఠశాలల్లో చేర్పించేందుకు అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని మంత్రి నారా లోకేశ్ ఆదేశించారు. ఈ ఏడాది ఇప్పటికే 33 వేల మందిని పాఠశాలల్లో చేర్పించామని, మిగిలిన వారి వివరాలను 'లీప్' యాప్ ద్వారా ప్రధానోపాధ్యాయులకు పంపామని పాఠశాల విద్య డైరెక్టర్ తమీమ్ అన్సారియా తెలిపారు. పిల్లలను బడికి పంపేలా తల్లిదండ్రులను చైతన్యవంతం చేస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో ఉపాధ్యాయుల హాజరు శాతం 98.97 శాతంగా ఉండటంపై సంతృప్తి వ్యక్తం చేసిన మంత్రి, విద్యార్థుల హాజరు శాతాన్ని కూడా పెంచాలని సూచించారు. వరుసగా మూడు రోజులు బడికి రాని విద్యార్థుల తల్లిదండ్రులను పాఠశాలకు పిలిపించి కౌన్సిలింగ్ ఇవ్వాలని, ఈ బాధ్యతను పాఠశాల యాజమాన్య కమిటీలకు అప్పగించాలని స్పష్టం చేశారు.

**ఇంటర్ విద్యలో పురోగతి**

ఈ ఏడాది ఇంటర్మీడియట్ రెండో సంవత్సరంలో మంచి ఉత్తీర్ణత సాధించామని, గత ఏడాదితో పోలిస్తే సుమారు 10 వేల అడ్మిషన్లు పెరిగాయని ఇంటర్మీడియట్ విద్య కమిషనర్ రంజిత్ బాషా తెలిపారు. చదువులో వెనుకబడిన విద్యార్థుల కోసం 'సంకల్ప్ అకడమిక్ సపోర్ట్ ప్రోగ్రామ్' కింద ప్రత్యేక తరగతులు నిర్వహించేందుకు రూట్ మ్యాప్ సిద్ధం చేశామన్నారు. 'తల్లికి వందనం' పథకం ద్వారా ఈ ఏడాది ఇంటర్ విద్యార్థులకు రూ.1051 కోట్లు అందించామని, మొదటి సంవత్సరం విద్యార్థులకు కూడా త్వరలో అందిస్తామని చెప్పారు. ఇంటర్ విద్యార్థులకు సంబంధించి నూరుశాతం అపార్ (APAAR) ఐడీ ఇంటిగ్రేషన్ పూర్తి చేయాలని మంత్రి ఆదేశించారు.

**మధ్యాహ్న భోజనం నాణ్యతపై రాజీ లేదు**

మధ్యాహ్న భోజనం పథకం నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. నాణ్యతపై ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు 'లీప్' యాప్ ద్వారా ఎప్పటికప్పుడు ఫీడ్‌బ్యాక్ అందించాలని కోరారు. అలాగే, విద్యార్థుల్లో ఒత్తిడి లేని అభ్యసన వాతావరణాన్ని కల్పించడంపై ఉపాధ్యాయులు దృష్టిసారించాలని సూచించారు. ఉపాధ్యాయులకు ఏఐ టూల్స్‌పై శిక్షణ ఇచ్చేందుకు 'ఏఐ సమర్థ్' కార్యక్రమం చేపడుతున్నామని, ఈనెల 5న ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా 192 మంది ఉత్తమ ఉపాధ్యాయులను సన్మానిస్తామని అధికారులు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు స్పెషల్ టెట్ నిర్వహణ, పదో తరగతి విద్యార్థుల కోసం 'మిషన్ మార్చి 2026'పై కూడా సమావేశంలో చర్చించారు. రాష్ట్రవ్యాప్తంగా 125 కేంద్రాల్లో ఆటిజం సెంటర్లు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి శ్యామలరావు, సమగ్రశిక్ష స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్ బి. శ్రీనివాసరావు, పాఠశాల విద్య మౌలిక సదుపాయాల సంస్థ ఎండీ దీవెన్ రెడ్డి తదితర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## నేపాల్ విపత్తును ముందే పసిగట్టిన 'నైసర్' శాటిలైట్..

(మొదటిపేజీ తరువాయి)

విషయాలను వెల్లడించాడు. విపత్తు సంభవించడానికి కొన్ని వారాల ముందే ప్రమాదకర ప్రాంతంలోని పర్వత వాలులో భారీ మార్పులు చోటుచేసుకున్నట్లు అతడు గుర్తించాడు. అక్కడి మంచు, రాతి పొరలు తీవ్ర ఒత్తిడికి గురై, ఆ ప్రాంతం ఏకంగా కొన్ని మీటర్ల మేర పక్కకు జరిగినట్లు తేలింది. ఈ కదలికలు ఒకేచోట కేంద్రీకృతం కావడం, రాబోయే కొండచరియల విపత్తుకు స్పష్టమైన సంకేతమని లియు తన విశ్లేషణలో పేర్కొన్నాడు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో), అమెరికా అంతరిక్ష సంస్థ (నాసా) సంయుక్తంగా ఈ 'నైసర్' (నాసాఇస్రో సింథటిక్ అపెర్చర్ రాడార్) ఉపగ్రహాన్ని అభివృద్ధి చేశాయి. ప్రకృతి వైపరీత్యాలను ముందే గుర్తించి, హెచ్చరికలు జారీ చేసే లక్ష్యంతో దీన్ని గత ఏడాదే ప్రయోగించారు. ఇది ప్రపంచంలోనే అత్యంత శక్తిమంతమైన భూ పరిశీలన ఉపగ్రహాల్లో ఒకటి. మేఘాలు, వర్షం, పొగమంచు వంటి ప్రతికూల పరిస్థితుల్లోనూ పగలు, రాత్రి తేడా లేకుండా స్పష్టమైన చిత్రాలను తీయగల రెండు సింథటిక్ అపెర్చర్ రాడార్లను (ఎల్ బ్యాండ్, ఎస్‌బ్యాండ్) కలిగి ఉన్న తొలి శాటిలైట్ ఇదే. ఈ వివరాల ప్రకారం, నైసర్ తన బాధ్యతను సక్రమంగా నిర్వర్తించిందని, విపత్తుకు సంబంధించిన కీలక సమాచారాన్ని ముందే అందించిందని స్పష్టమవుతోంది. అయితే, ఆ సంకేతాలను సరైన సమయంలో విశ్లేషించి, తక్షణమే రక్షణ చర్యలు చేపట్టడంలోనే అసలు సవాలు ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

## నేపాల్ వరదలు.. విదేశీయుల మృతదేహాల గుర్తింపుపై కీలక ప్రకటన

నేపాల్‌లోని రసువా జిల్లాలో ఇటీవల సంభవించిన వరదల్లో మరణించిన విదేశీ పౌరుల మృతదేహాలను గుర్తించి, వారి బంధువులకు అప్పగించే ప్రక్రియకు సంబంధించిన వివరాలను నేపాల్ అధికారులు విడుదల చేశారని ఖాట్మండులోని భారత రాయబార కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ప్రక్రియను పూర్తి చేసిన తర్వాతే మృతదేహాలను అప్పగిస్తారని స్పష్టం చేసింది. నేపాల్ ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం.. మొదట మృతదేహాలకు సంబంధించిన పూర్తి వివరాలను నమోదు చేస్తారు. ఫొటోలు తీసి, పోస్టుమార్టం నిర్వహించి మరణానికి గల కారణాలను ధ్రువీకరిస్తారు. అనంతరం పాస్‌పోర్ట్, వేలిముద్రలు, డీఎన్ఏ వంటి ఫోరెన్సిక్ నమూనాల ఆధారంగా మృతుల గుర్తింపును అధికారికంగా నిర్ధారిస్తారు. ఈ ప్రక్రియ మొత్తం సంబంధిత దేశాల రాయబార కార్యాలయాల సమన్వయంతో జరుగుతుందని, చివరగా హ్యాండోవర్ మెమోపై సంతకాలు తీసుకుని మృతదేహాలను అప్పగిస్తారని ఎంబసీ వివరించింది. నేపాల్ పోలీస్ వెబ్‌సైట్‌లో ఉంచిన మృతుల ఫొటోలు, వివరాల ఆధారంగా బంధువులు ఎవరైనా గుర్తిస్తే, తదుపరి ప్రక్రియల కోసం స్థానిక అధికారులతో సమన్వయం చేసేందుకు ఖాట్మండులోని రాయబార కార్యాలయ అధికారులు సహాయం అందిస్తారని ప్రకటనలో పేర్కొన్నారు. అయితే, ఆరోగ్యపరమైన సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు ఇప్పటికే పెద్ద సంఖ్యలో మృతదేహాలకు తాత్కాలికంగా ఖననం చేసినట్లు నేపాల్ అధికారులు తెలిపారు. ఇలాంటి మృతదేహాలను గుర్తించాలంటే, మృతుల సమీప బంధువులతో డీఎన్ఏ సరిపోల్చడం తప్పనిసరి అని భారత రాయబార కార్యాలయం స్పష్టం చేసింది. ఇందుకోసం బంధువులు తమ డీఎన్ఏ ప్రొఫైళ్లను `dnacodis@nepalpolice.gov.np` లేదా `eoikathmandu floodsupport@gmail.com` అనే ఈమెయిల్ ఐడీలకు పంపవచ్చు. లేదంటే నేరుగా రక్త నమూనాలు కూడా ఇవ్వొచ్చని సూచించింది. సహాయం కోసం నేపాల్ పోలీస్ హెల్ప్‌లైన్ నంబర్: +977 9841 6160 95, భారత రాయబార కార్యాలయం హెల్ప్‌లైన్ నంబర్లు: +977 985 131 6807, +977 970 910 7500, +977 981 032 6117 లలో సంప్రదించాలని సూచించారు. ఆగస్టు 26న చైనాలోని టిబెట్ ప్రాంతంలో పుట్టిన ఈ ఆకస్మిక వరద, భోటే కోశి నది ద్వారా నేపాల్‌లోకి ప్రవేశించి పెను విధ్వంసం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ దుర్ఘటనలో వందలాది మంది, అనేక మంది విదేశీయులు సహా ప్రాణాలు కోల్పోయారు.

## సంపాదకీయం

### మాతృభాష

# మూలాలు మరవని ప్రయాణం!

మొన్న తెలుగు భాషా దినోత్సవం రోజున ఆ వేడుకల్లో పాల్గొన్న, అమెరికాలో స్థిరపడిన ఒక కుటుంబాన్ని చూస్తే ముచ్చటగా అనిపించింది. వారి పిల్లలు చక్కటి తెలుగు మాట్లాడుతున్నారు. ఆ పిల్లలకు పదిహేను సంవత్సరాలు ఉంటాయి. విదేశాల్లో స్థిరపడిన వారి పిల్లలు చాలామంది ఒక వయస్సు వచ్చేవరకు మాతృభాష మాట్లాడతారు; తరువాత వారు ఉపయోగించే భాషలో ఒకలాంటి యాస కలుస్తుంది, పదప్రయోగంలో తడబాటు ఉంటుంది. కానీ, ఆ పిల్లలు మన దగ్గరే పెరిగి మనం మాట్లాడుతున్నంత చక్కగా మాట్లాడుతున్నారు. తల్లిదండ్రులు ప్రత్యేకంగా నేర్పిస్తున్నారేమో అనిపించింది. అదే ప్రశ్న ఎవరో అడిగితే ఆ పిల్లల తల్లిదండ్రులు చెప్పిన సమాధానం ఆశ్చర్యం కలిగించింది. "నేర్పిస్తే అంతవరకే మాట్లాడతారు, కానీ ఇంట్లో మనం మాట్లాడితే వాళ్లకు అలవాటు అవుతుంది" అన్నారు. నిజమే, 'అభ్యాసం కూసు విద్య' అన్నట్లు రోజూ మాట్లాడటం అనే అభ్యాసం వారిని నిష్ణాతులను చేసింది. కానీ అది చాలా కష్టం. అక్కడ వారి స్నేహితులందరూ ఇంగ్లీష్ మాత్రమే మాట్లాడుతారు. ఆఖరుకు అక్కడ స్థిరపడిన మన పిల్లలే తెలుగు మర్చిపోయినట్లు మాట్లాడుతుంటారు. కారణం వారు పనిచేసే చోట స్థానిక భాషే మాట్లాడాలి కాబట్టి. అటువంటి పరిస్థితుల్లో ఆ పిల్లలు ఇంట్లో తెలుగు మాట్లాడుతూ, చదువుల్లో వెనుకబడకుండా ఉండటానికి అక్కడి భాషపై పట్టు సాధించాలి. ఆ కుటుంబాన్ని వెంకయ్య నాయుడు గారు చూసి ఉంటే చాలా సంతోషపడేవారేమో. ఆయన ఎప్పుడూ "అమ్మ భాషను మరచిపోకూడదు" అంటారు. నిజమే! ఎన్ని భాషలు వచ్చినా మాతృభాష తరువాతే ఏదైనా. తన పొత్తిళ్లలోకి తీసుకునేటప్పుడు అమ్మ స్పర్శతో పాటు అమ్మ ఉపయోగించే పదం కూడా బిడ్డకు అర్థమైపోతుంది. అమ్మ నేర్పిన ఆ భాష జీవితకాలం మనతో ఉండిపోతుంది. ఏదో ఒక దశలో అమ్మను కోల్పోతాం, కానీ అమ్మ భాష మాత్రం మనలను వదిలిపెట్టి ఎక్కడికీ వెళ్లదు. బహుశా అమ్మ తాను వెళ్లినా, తన భాషను మనకు తోడుగా ఉంచుతుంది. ఇద్దరు వ్యక్తులు తమ అభిప్రాయాలను చెప్పకోవటానికి, ఒకరితో ఒకరు సంభాషించటానికి ఏ భాష అయితే ఏమిటి అని అడిగితే సమాధానం చెప్పటం కష్టం. దానికి చెప్పగలిగే ఏకైక సమాధానం ఒక్కటే—బంధాలు అంటే తెలియని పసిపిల్లలకు కూడా అమ్మ స్పర్శ తగలగానే భద్రతగా ఎందుకు అనిపిస్తుందో, అమ్మ భాష కూడా అలాంటిదే. మనం ఒక పాట వినాలంటే సుమధుర కంఠం అయితేనే వింటాం. కానీ గొంతుతో సంబంధం లేకుండా మనం ఇష్టంగా వినేది చిన్నప్పుడు అమ్మ పాడే జోలపాట. దానికి సాహిత్యంతో సంబంధం లేదు, సంగీతంతో సంబంధం లేదు. మాతృభాష కూడా అంతే. ఇంగ్లీష్ మాట్లాడే అమ్మలు వచ్చిన తరువాత పిల్లల మాతృభాష ఏదో నిర్ణయించటం కష్టమైపోయింది. గత ఇరవై సంవత్సరాలలో వచ్చిన మార్పు ఏమిటంటే, చాలామంది పిల్లలు తమకు తెలుగు చదవటం రాదు అని చెప్పటం. పట్టణాలలో పెరిగిన వారికి మాతృభాష తెలియకపోవటం నలభై, యాభై సంవత్సరాల క్రితమే మొదలయ్యింది. మాతృభాష రాకపోవటాన్ని తప్పొప్పుల విషయంగా పరిగణించలేము కానీ, ఎంత ఇంగ్లీష్ భాష వచ్చినా మన భాషలో జరిగే సంభాషణ ఆత్మీయతను పెంచుతుంది. వేరే దేశమే కాదు, మన దేశంలోనే వేరే రాష్ట్రాలకు వెళ్లినప్పుడు మన ఆహారంతో పాటు మన భాష వినిపించక వెలితిగా అనిపిస్తుంది. పరాయి దేశాలకు వెళ్లినప్పుడు పొరపాటున మన చుట్టుపక్కల ఎక్కడైనా మన మాతృభాష వినిపిస్తే, మనకు తెలియకుండానే ఆ మాట్లాడింది ఎవరా అని చుట్టూ చూస్తాం. వాళ్లు కనిపించగానే వారు మనకు ఎప్పటి నుంచో తెలిసినట్లుగా ఓ చిరునవ్వు నవ్వుతాం. ఆ భాషా బంధం మనల్ని ఆత్మీయులను చేస్తుంది. ఈ మధ్య మన సినిమాలు దేశ విదేశాలలో ప్రదర్శించబడుతున్నాయి కాబట్టి సరిపోయింది కానీ, గతంలో విదేశాలకు వెళ్లినా, చివరకు ఢిల్లీ వెళ్లినా తెలుగు సినిమా ఉన్న సినిమా హాలుకు వెళ్లి కూర్చునేవాళ్లం. అక్కడ తెలుగు మాట వినగానే బెంగ తీరిపోయినట్లు అనిపించేది. మన ఇంట్లో ముద్దపప్పు, ఆవకాయ కలుపుకుని తిన్నంత ఆనందం కలిగేది. పరాయి గడ్డ మీద స్థిరపడి ఎన్ని కోట్లు సంపాదిస్తున్నా, ఎన్ని దశాబ్దాలు గడిచినా స్వదేశానికి రాగానే తెలియని ఉద్వేగానికి గురవుతారు; భాష కూడా అంతే.కానీ ఉద్యోగాల కోసం ఇంగ్లీష్ నేర్చుకోవలసిన పరిస్థితుల వలన మాతృభాష ఇబ్బందులను ఎదుర్కొంటున్నది అనేది వాస్తవం. రెండు తెలుగు రాష్ట్రాలలో ఇళ్లల్లో దైనందిన జీవితంలో మాతృభాషలో కాక ఆంగ్లంలో మాట్లాడుకోవటం ఎక్కువైంది. సంస్కృతీ సంప్రదాయాలను అట్టహాసంగా అనుసరిస్తున్నారు కానీ, అమ్మ భాష మాత్రం ఆదరణ కోల్పోతున్నది. భాష విషయంలో చైనాను చూసి మనం ఎంతైనా నేర్చుకోవలసి ఉన్నది. చైనాలో ప్రాథమిక విద్య నుండి విశ్వవిద్యాలయ చదువు వరకు మాండరిన్ భాషలోనే సాగుతుంది. అయితే చైనాలో కూడా ప్రాంతీయ భాషలు ఉన్నాయి; కానీ విద్య, ఉద్యోగం, పరిపాలనకు సంబంధించిన విషయాలన్నీ ప్రభుత్వం అధికార భాషగా గుర్తించిన మాండరిన్ లోనే సాగుతాయి. అమెరికాలో చదివే చైనా విద్యార్థులు చదువును ఆంగ్లంలోనే సాగించినా, విశ్వవిద్యాలయ ప్రాంగణంలో జరిగే గ్రూప్ డిస్కషన్స్ అన్నీ మాండరిన్ భాషలోనే చేసుకుంటారు. పరీక్షలు పరాయి భాషలో రాసినప్పటికీ, చదువు గురించి చర్చించుకునే సమాచారమంతటికీ మాండరిన్ భాషనే ఉపయోగిస్తారు. అదే రీతిలో వారు అమెరికాలో చదువుకుంటున్నప్పుడు కూడా చైనా యాప్‌లు, చైనా స్టడీ మెటీరియల్స్‌ను విస్తృతంగా ఉపయోగిస్తారు. అంటే చైనా విద్యార్థి అమెరికాలో చదువుకున్నా తమ ఆలోచనలను, చదువుకు సంబంధించిన పరస్పర సహకారాన్ని, అంతర్గత అవగాహనను తమ మాతృభాషలోనే కొనసాగిస్తారు. "ఆంగ్లం ఉంటేనే ప్రపంచంలో బతకగలం" అనే ఆలోచనకు దూరంగా ఉంటారు. అందువలనే చైనా శాస్త్ర, సాంకేతిక రంగాలను, ఉన్నత విద్యను తమ అధికారిక భాష అయిన మాండరిన్ లోనే అభివృద్ధి చేసుకున్నది. ప్రపంచంలో ఏ మూల కొత్త ఆవిష్కరణ జరిగినా దాన్ని వెంటనే చైనీస్ భాషలోకి అనువదించి తమ ప్రజలకు అందజేస్తుంది. కొత్త సాంకేతికతకు తమ భాషలోనే ఒక కొత్త పదాన్ని సృష్టించుకుంటారు. అందుకే చైనాలో ఇంగ్లీష్ రాని విద్యార్థి కూడా అధునాతన సాంకేతికతను సులభంగా అర్థం చేసుకోగలుగుతాడు. మన దేశంలో ప్రాథమిక విద్య మాతృభాషలోనే జరగాలని నిర్ణయించారు కానీ, విద్యా ప్రైవేటీకరణ వలన మాతృభాషలో విద్యావిధానం అనేది మృగ్యమైపోయింది. పిల్లలు ఇంట్లో మాట్లాడేది ఒక భాష, పాఠశాలలో మరొక భాష కావడంతో వారి మానసిక వికాసం దెబ్బతింటోందని విద్యావేత్తలు ఆందోళన చెందుతున్నారు. మాతృభాష గురించే ఇంత వివాదం నడుస్తుంటే, హిందీని బలవంతంగా రుద్దే ప్రయత్నం మరోవైపు జరుగుతున్నది. కానీ మన భాషకు కూడా మంచి రోజులు వస్తున్నాయి. అమెరికాలో స్థిరపడిన కొల్లు రంజిత్ కుమార్ పిల్లలకు తెలుగు భాషను నెత్తిమీద రుద్దినట్లుగా కాకుండా, వారికి సరదాగా అనిపించే రీతిలో తెలుగు అక్షరాలను నేర్చుకునేలా ఒక యాప్‌ను రూపొందించారు. తన పిల్లలు తెలుగు భాష నేర్చుకోవటానికి ప్రత్యేకంగా క్లాసులకు వెళ్లటానికి విముఖత చూపినందుకు, పది సంవత్సరాలు కష్టపడి ఆ యాప్‌ను రూపొందించారు. వారి పిల్లలు పెద్దవాళ్లు అయ్యారు కాబట్టి యాప్ అవసరం లేదని అనుకోకుండా, ఎలాగైనా తెలుగు అక్షరమాలను పిల్లలు ఇష్టంగా నేర్చుకోవటానికి వారు, వారి బృందం పట్టుదలగా కృషి చేయటం నిజంగా అభినందనీయం. మన భాష మంచి సాహిత్య విలువలు కలిగిన భాష. మనకు ఎన్నో మంచి మంచి పుస్తకాలు ఉన్నాయి. సాహిత్యాన్ని గ్రాంథికం నుండి వ్యావహారికంలోకి తీసుకురావడంలో కూడా మనవారు ఎంతో ముందుగా సాహసం చేశారు. వీటన్నిటికీ మించి మాతృభాష అనేది అమ్మ ఇచ్చిన తీపి జ్ఞాపకం. మనం ఒంటరిగా ఉండకూడదు అన్నట్లుగా తోబుట్టువులను ఇచ్చినట్లే, అమ్మ భాషను కూడా ఇస్తుంది. అమ్మ జ్ఞాపకాలను ఎంత పదిలంగా దాచుకుంటామో, అమ్మ భాషను కూడా అంతకంటే పదిలంగా కాపాడుకుందాం.!

- ఇంద్రాణి

## చరిత్రలో ఈ రోజు
### సెప్టెంబర్ 02

* 1936: తెలుగు సినిమా నటుడు హరనాథ్ జననం (మ.1989).
* 1942: 14వ లోక్‌సభలో సభ్యుడు బాడిగ రామకృష్ణ జననం.
* 1954: తిరుపతి లో శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం స్థాపించబడింది.
* 1973: తెలుగు సినీ నటుడు పవన్ కళ్యాణ్ జననం.
* 2009: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వై.యస్. రాజశేఖర్ రెడ్డి మరణం (జ.1949).
* 2011: తెలుగు పాత్రికేయరంగ ప్రముఖుడు, ప్రసిద్ధ రచయిత నండూరి రామమోహనరావు మరణం (జ.1927).
* 1943: తెలంగాణ రచయిత, కవి, సాహితివేత్త మల్లావఝ్ఝల సదాశివ్ జననం. (మ. 2005)


వై.యస్. రాజశేఖర్ రెడ్డి

### లబ్ధిదారులకు ఎన్టీఆర్ భరోసా పెన్షన్లు
## అందజేసిన సయ్యద్ మెహతాజ్ బేగం





కోడూరు మేజర్ న్యూస్: పేదలు, వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర అర్హులైన లబ్ధిదారులకు ప్రభుత్వం అందిస్తున్న ఎన్టీఆర్ భరోసా పెన్షన్ వారి ఇంటి ముంగిటకే చేరేలా తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేస్తున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర మైనారిటీ సెల్ కార్యదర్శి సయ్యద్ మెహతాజ్ బేగం అన్నారు. ఈ సందర్భంగా ఈ రోజు రైల్వే కోడూరు నియోజకవర్గంలోని కోడూరు మండలం బూత్ నెంబర్ 94 పరిధిలోని జగడం పల్లి, బాలాజీ నగర్ ప్రాంతంలో లబ్ధిదారుల ఇళ్లకు స్వయంగా వెళ్లి ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను అందజేశారు. తెలుగుదేశం పార్టీ రైల్వే కోడూరు నియోజకవర్గ ఇన్చార్జి శ్రీ ముక్కా రూపానంద రెడ్డి గారి ఆదేశాల మేరకు లబ్ధిదారుల వద్దకు వెళ్లి పెన్షన్లు అందజేసినట్లు సయ్యద్ మెహతాజ్ బేగం తెలిపారు. పెన్షన్ అందుకుంటున్న లబ్ధిదారులతో ఆమె ఆప్యాయంగా మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా క్షేత్రస్థాయిలో పనిచేయడం తమ బాధ్యతగా భావిస్తున్నామని ఆమె పేర్కొన్నారు. ఎన్టీఆర్ భరోసా పెన్షన్ అనేది కేవలం ఆర్థిక సహాయం మాత్రమే కాదని, పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఒక ఆత్మవిశ్వాసం, ఆర్థిక భరోసా అని సయ్యద్ మెహతాజ్ బేగం అన్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు తదితర లబ్ధిదారులకు పెన్షన్ ద్వారా ప్రతి నెలా ఆర్థిక సహాయం అందడం వల్ల వారి రోజువారీ అవసరాలకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రజల సమస్యలను తెలుసుకోవడం, అర్హులైన వారికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూడడం కోసం తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు ఎల్లప్పుడూ ప్రజల మధ్యనే ఉంటారని ఆమె అన్నారు. ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. అలాగే రైల్వే కోడూరు నియోజకవర్గంలో ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వారికి అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని సయ్యద్ మెహతాజ్ బేగం తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, బూత్ స్థాయి ప్రతినిధులు, లబ్ధిదారులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.




### వెలిగొండ ప్రాజెక్టు కోసం గళమెత్తిన గజల్ శ్రీనివాస్
## ఆకట్టుకుంటున్న 'అదిగదిగో వెలిగొండ' ప్రత్యేక గీతం!

అమరావతి: ప్రకాశం, నెల్లూరు మరియు కడప జిల్లాల ప్రజల చిరకాల స్వప్నమైన వెలిగొండ ప్రాజెక్టు ప్రాధాన్యతను, కృష్ణా జలాల రాకతో ఆ ప్రాంతాల్లో చిగురిస్తున్న ఆశలను వివరిస్తూ రూపొందించిన ప్రత్యేక గీతం ప్రస్తుతం విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రముఖ గాయకుడు గజల్ శ్రీనివాస్ ఆలపించిన ఈ గీతంలో వెలిగొండ ప్రాజెక్టు చరిత్ర, రైతుల ఆకాంక్షలు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సంకల్పం ప్రధానంగా ప్రతిబింబించాయి.

**పాటలోని ముఖ్యాంశాలు:**

దాహం తీర్చే జీవధార : వెలిగొండ ప్రాజెక్టు ద్వారా కృష్ణమ్మ ప్రవాహం కరువు నేలను తడుపుతూ, లక్షలాది మంది ప్రజల దాహాన్ని తీర్చే నీటికొండలా మారిందని పాట ప్రారంభంలో అభివర్ణించారు. కరువు ప్రాంతాల కన్నీరు తుడిచిన సంకల్పం : మార్కాపురం, గిద్దలూరు, కనిగిరి, దర్శి, పొదిలి, ఎర్రగొండపాలెం, ఉదయగిరి, ఆత్మకూరు, బద్వేలు వంటి వెనుకబడిన ప్రాంతాల ప్రజల గొంతులు, వారి ఆవేదనను అర్థం చేసుకుని నల్లమల కొండలను చీల్చి జలధారను తీసుకొచ్చిన వైనాన్ని కళ్లకు కట్టారు. లక్షలాది ఎకరాలకు పచ్చని హారం : ఈ ప్రాజెక్టు ద్వారా శ్రీశైల మల్లన్న ఆశీస్సులతో నల్లమల గుండెల్లోంచి తరలివచ్చిన జలధార లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు అందించడంతో పాటు, దాదాపు 23 లక్షల మంది ప్రజలకు తాగునీరు అందించి జీవాధారంగా మారిందని పేర్కొన్నారు. దశాబ్దాల నిరీక్షణకు ఫలితం : గతంలో చంద్రబాబు వేసిన పునాదిరాయి నేడు సాకారమై, స్వర్ణాంధ్ర దిశగా దశాబ్దాల కలను నిజం చేసిందని, చీకటిని తొలగించి తెలుగు నేలపై నయా జలవిజయ గాథను లిఖించిందని పాటలో తెలియజేశారు.

# తిరుపతి ఎయిర్‌పోర్ట్: మారిన విమాన సర్వీసుల వేళలు

- ఇండిగో, స్టార్ ఎయిర్, ఎయిర్ ఇండియా సర్వీసుల టైమింగ్స్‌లో మార్పులు
- హైదరాబాద్, ఢిల్లీ, విశాఖ మార్గాల్లో కొత్త సమయాలు
- ప్రయాణానికి ముందు సమయాలు చూసుకోవాలని ప్రయాణికులకు సూచన




తిరుపతి విమానాశ్రయం నుంచి రాకపోకలు సాగించే పలు విమాన సర్వీసుల వేళల్లో మార్పులు చోటుచేసుకున్నాయి. ఈ నూతన షెడ్యూల్ సెప్టెంబర్ 1, 2026 (మంగళవారం) నుంచి అమల్లోకి వచ్చినట్లు విమానాశ్రయ అధికారులు వెల్లడించారు. ప్రయాణికులు తమ ప్రయాణానికి ముందు మారిన సమయాలను ఒకసారి సరిచూసుకోవాలని ఈ సందర్భంగా సూచించారు. ప్రముఖ విమానయాన సంస్థ ఇండిగోకు చెందిన పలు సర్వీసుల సమయాల్లో మార్పులు జరిగాయి. నూతన షెడ్యూల్ ప్రకారం హైదరాబాద్ నుంచి తిరుపతికి నాలుగు సర్వీసులు నడుస్తున్నాయి. ఇవి ఉదయం 7:20, 11:15, మధ్యాహ్నం 1:50, రాత్రి 8:20 గంటలకు తిరుపతికి చేరుకుంటాయి. తిరిగి తిరుపతి నుంచి ఉదయం 8:00, 11:45, మధ్యాహ్నం 2:30, రాత్రి 9:00 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరుతాయి. విశాఖపట్నం నుంచి మధ్యాహ్నం 3:30 గంటలకు చేరుకుని సాయంత్రం 4:00 గంటలకు, ఢిల్లీ నుంచి సాయంత్రం 6:25 గంటలకు చేరుకుని రాత్రి 7:05 గంటలకు తిరిగి వెళ్లే సర్వీసుల సమయాలను కూడా సవరించారు. ఇతర సర్వీసుల విషయానికొస్తే.. స్టార్ ఎయిర్ విమానం శివమొగ్గ నుంచి మధ్యాహ్నం 12:20 గంటలకు తిరుపతికి చేరుకుంటుంది. ఈ విమానం తిరిగి సాయంత్రం 6:00 గంటలకు హైదరాబాద్‌కు బయలుదేరుతుంది. అదేవిధంగా, ఎయిర్ ఇండియా విమానం హైదరాబాద్ నుంచి సాయంత్రం 5:10 గంటలకు తిరుపతికి చేరుకుని, సాయంత్రం 6:00 గంటలకు తిరిగి హైదరాబాద్‌కు పయనమవుతుంది. ప్రయాణికులు మారిన సమయాలను గమనించి, ప్రయాణానికి ముందు సంబంధిత విమానయాన సంస్థల ద్వారా వివరాలను నిర్ధారించుకోవాలని అధికారులు కోరారు.

## వైసీపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి తీరుతాయి

: నారాయణ

- నిబంధనలు, కోర్టు ఆదేశాలకు అనుగుణంగానే నిర్ణయాలు తీసుకుంటామన్న నారాయణ
- ఓటమి భయంతోనే వైసీపీ నేతలు కోర్టులను ఆశ్రయిస్తున్నారని ఎద్దేవా
- అభ్యర్థులు కూడా లేని దయనీయ పరిస్థితుల్లో వైసీపీ ఉందని వ్యాఖ్య



వైసీపీ ఎన్ని అడ్డంకులు సృష్టించినా, కోర్టుల్లో కేసులు వేసినా స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి తీరుతాయని ఏపీ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. నిబంధనలు, న్యాయస్థానం ఆదేశాలకు అనుగుణంగానే ఎన్నికల నిర్వహణపై నిర్ణయాలు తీసుకుంటామని ఆయన వెల్లడించారు. రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో ఇప్పటికే రూ. 3,300 కోట్లతో వివిధ అభివృద్ధి పనులను ప్రారంభించామని మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమం, రాష్ట్రాభివృద్ధిని చూసి తట్టుకోలేక ఓటమి భయంతోనే వైసీపీ నాయకులు కోర్టులను ఆశ్రయిస్తున్నారని విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో పోటీ చేసేందుకు అభ్యర్థులు కూడా లేని దయనీయ స్థితిలో ఆ పార్టీ ఉందన్న ఆయన... అందుకే రాష్ట్రంలో ఎక్కడా ఎన్నికలు ఏకగ్రీవం కాకూడదని జగన్ తన నేతలకు హుకుం జారీ చేశారని ఎద్దేవా చేశారు. ఇదే సమయంలో... భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం, వెలిగొండ ప్రాజెక్టుల క్రెడిట్ తమదేనని వైసీపీ నేతలు ప్రచారం చేసుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. గత ప్రభుత్వం చేసిన చారిత్రక తప్పిదాలను, నిర్లక్ష్యాన్ని కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా సరిదిద్దుకుంటూ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో తీసుకెళ్తోందని వివరించారు. నెల్లూరు నగరంలో కాలువల కట్టలపై ఇళ్లు నిర్మించుకుని నివసిస్తున్న పేదలకు శాశ్వత పట్టాలు మంజూరు చేసే అంశంపై త్వరలోనే ప్రభుత్వం తీపి కబురు అందిస్తుందని హామీ ఇచ్చారు.

## ప్రపంచం తడబడుతున్నా.. భారత్ దూసుకెళ్తోంది: పవన్ కల్యాణ్

- తొలి త్రైమాసికంలో భారత్ జీడీపీ 7.8% వృద్ధి
- వృద్ధి దేశ ఆర్థిక బలానికి నిదర్శనమన్న పవన్
- ప్రపంచ అనిశ్చితిపై భారత్ స్థైర్యం చాటిందని వెల్లడి
- మోదీ నాయకత్వాన్ని ప్రశంసించిన పవన్ కల్యాణ్
- డిజిటల్ రంగం, మౌలిక వసతుల్లో పురోగతి ఉందని వ్యాఖ్య



భారత్ జీడీపీ 202627 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి నమోదు చేయడం దేశ ఆర్థిక స్థైర్యం, విశ్వాసానికి నిదర్శనమని ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ప్రపంచవ్యాప్తంగా యుద్ధాలు, భౌగోళిక ఉద్రిక్తతలు, చమురు ధరల్లో హెచ్చుతగ్గులు, సరఫరా వ్యవస్థలో అంతరాయాలు కొనసాగుతున్నా భారత్ తన బలాన్ని చాటుకుందని పేర్కొన్నారు. ఈ మేరకు పవన్ కల్యాణ్ మంగళవారం 'ఎక్స్' వేదికగా స్పందించారు. జీడీపీ వృద్ధి కేవలం ఒక సంఖ్య కాదని, దేశ ప్రజల సమష్టి శక్తిని ప్రతిబింబిస్తోందని తెలిపారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో సవాళ్లను అవకాశాలుగా మార్చుకుంటూ దేశం ముందుకు సాగుతోందన్నారు. 2014 నుంచి భారత్ ఆర్థికంగా మరింత బలపడిందని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. స్వయం సమృద్ధి, డిజిటల్ రంగం, మౌలిక వసతుల అభివృద్ధిలో గణనీయమైన మార్పులు వచ్చాయని తెలిపారు. యువత పెద్ద కలలు కనడంతో పాటు ఆవిష్కరణలు, వ్యాపారాలు, సాంకేతిక రంగంలో ముందుకు సాగేందుకు అవకాశాలు పెరిగాయని చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా అనిశ్చిత పరిస్థితులు ఉన్నా భారత్ అభివృద్ధి పథంలో కొనసాగుతోందని పవన్ కల్యాణ్ అన్నారు. ప్రపంచ వేదికపై దేశానికి విశ్వసనీయత, ప్రాధాన్యం పెరిగిందని పేర్కొన్నారు. బలమైన, స్వయం సమృద్ధి, భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనే దేశంగా 'వికసిత్ భారత్' దిశగా అడుగులు పడుతున్నాయని తెలిపారు.

## వెలిగొండ కాలువలో నీళ్లు తాగుతున్న వానరాలు..
### వీడియో పోస్ట్ చేసిన సీఎం చంద్రబాబు

- వెలిగొండ కాలువలో కోతుల వీడియో షేర్ చేసిన చంద్రబాబు
- "జలం.. జీవం.. జీవితం" అంటూ పోస్టుకు క్యాప్షన్
- నిన్ననే మార్కాపురంలో ప్రాజెక్టు తొలిదశ ప్రారంభం
- దశాబ్దాల నాటి కరవు ప్రాంత దాహార్తిని తీరుస్తున్న ప్రాజెక్టు
- మూగజీవాల దాహం కూడా తీరుతోందని సీఎం సంతోషం



ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు తాజాగా సోషల్ మీడియాలో ఒక ఆసక్తికరమైన వీడియోను పంచుకున్నారు. నిన్న ప్రారంభమైన వెలిగొండ ప్రాజెక్టు ఫీడర్ కాలువలో కొన్ని కోతులు గుంపుగా వచ్చి నీళ్లు తాగుతూ తమ దాహాన్ని తీర్చుకుంటున్న దృశ్యాలు ఆ వీడియోలో ఉన్నాయి. "జలం.. జీవం.. జీవితం" అంటూ ఆయన ఈ వీడియోకు క్యాప్షన్ జోడించారు. ఈ పోస్ట్ ప్రస్తుతం వైరల్ అవుతోంది. మార్కాపురం జిల్లాలో దశాబ్దాల నాటి కలను సాకారం చేస్తూ సోమవారం పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు తొలి దశను ముఖ్యమంత్రి చంద్రబాబు జాతికి అంకితం చేసిన విషయం తెలిసిందే. ఫీడర్ కెనాల్ నుంచి కృష్ణా జలాలను నల్లమల సాగర్‌లోకి విడుదల చేసి, ప్రాజెక్టును ప్రారంభించారు. ఈ చారిత్రక ఘట్టంతో స్థానిక ప్రజలు భావోద్వేగానికి గురయ్యారు. ఈ నేపథ్యంలో, ప్రాజెక్టు ఫలాలు కేవలం మనుషులకే కాకుండా, ఆ ప్రాంతంలోని మూగజీవాలకు కూడా అందుతున్నాయనడానికి ఈ వీడియో నిదర్శనంగా నిలుస్తోంది. కరవు పీడిత ప్రాంతానికి సాగు, తాగునీరు అందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టును చేపట్టారు. పిల్ల కోతులతో సహా వచ్చి వానరాలు స్వేచ్ఛగా నీరు తాగుతుండటంపై సీఎం తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. మానవులతో పాటు జీవరాశుల దాహార్తిని కూడా ఈ ప్రాజెక్టు తీరుస్తోందన్న భావనను ఆయన తన పోస్ట్ ద్వారా తెలియజేశారు.

## ఏపీలో ఆ విద్యార్థులకు గుడ్ న్యూస్..
### మూడు రోజుల్లో 'తల్లికి వందనం' నిధులు

ఆంధ్రప్రదేశ్‌లో 'తల్లికి వందనం' పథకం కింద డబ్బులు పడకుండా ఎదురుచూస్తున్న విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త అందించింది. మరో మూడు రోజుల్లో అర్హులైన మిగిలిన విద్యార్థుల తల్లుల ఖాతాల్లో ఈ నిధులను జమ చేయనున్నట్లు వెల్లడించింది. ముఖ్యంగా ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరంలో చేరిన విద్యార్థులకు ఈ పథకం కింద ఆర్థిక సహాయం అందనుంది. వాస్తవానికి ఈ నిధులను ఆగస్టు 30వ తేదీనే లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేయాల్సి ఉండగా, కొన్ని సాంకేతిక కారణాల వల్ల వాయిదా పడింది. ఈ నేపథ్యంలో అధికారులు లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను పునఃసమీక్షించారు. ప్రస్తుతం గ్రామ, వార్డు సచివాలయాల నుంచి అర్హులైన లబ్ధిదారుల జాబితాలను స్వీకరిస్తున్నారు. ఈ జాబితాల




పరిశీలన పూర్తయిన వెంటనే ఆర్థిక శాఖ నేరుగా ఖాతాల్లోకి నగదును జమ చేయనుంది. ఈ విడతలో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 2.80 లక్షల మంది విద్యార్థులు ప్రయోజనం పొందనున్నారు. గతంలో అర్హత ఉండి కూడా వివిధ కారణాలతో నిధులు అందని వారికి సైతం ఈ దఫాలోనే నగదు జమ చేయనున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ప్రభుత్వ తాజా నిర్ణయంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కర్నూలు వైద్య రంగంలో తొలిసారిగా
### విజయవంతంగా లివర్, కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు: టీజీ భరత్

- సంయుక్తంగా ఆపరేషన్ నిర్వహించిన గౌరిగోపాల్ హాస్పిటల్, హైదరాబాద్‌లోని టీఎక్స్ ఆసుపత్రి
- 67 ఏళ్ల అశోక్ కు కాలేయ మార్పిడి శస్త్రచికిత్స
- ఇప్పటి వరకు పెద్ద నగరాలకే పరిమితమైన ఇటువంటి ఆపరేషన్లు



కర్నూలు జిల్లా వైద్య చరిత్రలో సరికొత్త అధ్యాయం ఆవిష్కృతమైందని, తొలిసారిగా విజయవంతంగా లివర్, కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు ఆంధ్రప్రదేశ్ పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ వెల్లడించారు. గౌరిగోపాల్ హాస్పిటల్, హైదరాబాద్‌లోని టీఎక్స్ (TX) హాస్పిటల్ సంయుక్తంగా, 'జీవనదాన్ ఆంధ్రప్రదేశ్' సహకారంతో ఈ అరుదైన మైలురాయిని సొంతం చేసుకున్నాయని కొనియాడారు. ఈ సంక్లిష్ట శస్త్రచికిత్సలలో భాగంగా 67 ఏళ్ల అశోక్‌కు కాలేయ (లివర్) మార్పిడి, అలాగే 26 ఏళ్ల షేక్ జబీ ఉల్లాకు మూత్రపిండాల (కిడ్నీ) మార్పిడి ఆపరేషన్లను వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. అనుభవజ్ఞులైన నిపుణులైన వైద్య బృందం దాదాపు 20 గంటల పాటు నిరంతరం శ్రమించి ఈ ప్రాణరక్షణ ప్రక్రియను పూర్తి చేశారని, ప్రస్తుతం ఇద్దరు రోగులు కోలుకుంటూ వైద్యుల పర్యవేక్షణలో పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని మంత్రి స్పష్టం చేశారు. ఇంతవరకు హైదరాబాద్, ఢిల్లీ, బెంగళూరు వంటి మహానగరాలకే పరిమితమైన ఇటువంటి అత్యంత క్లిష్టమైన అవయవ మార్పిడి చికిత్సలు ఇప్పుడు కర్నూలులోనే అందుబాటులోకి రావడం రాయలసీమ ప్రాంత ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని టీజీ భరత్ వ్యాఖ్యానించారు. బ్రెయిన్ డెడ్ అయిన వ్యక్తి కుటుంబ సభ్యులు ముందుకు వచ్చి అవయవ దానం చేయడం ద్వారా మరొకరికి పునర్జన్మ నిచ్చారని, వారి మానవతా దృక్పథం ఎంతో అభినందనీయమని చెప్పారు. కర్నూలును వైద్య హబ్‌గా తీర్చిదిద్దే క్రమంలో ఈ విజయం ప్రజల్లో కొత్త నమ్మకాన్ని, భరోసాను నింపిందని మంత్రి కొనియాడారు.

## పోలీసులపై కత్తితో
### దాడి చేసిన నిందితుడిపై కాల్పులు

విజయవాడ: పోలీసులపై కత్తితో దాడి చేసిన నిందితుడిపై పోలీసులు కాల్పులు జరిపారు. కృష్ణా జిల్లా కంకిపాడు మండలం కోమటికుంటలాకుల డొంకరోడ్డులో ఈ ఘటన చోటు చేసుకుంది. నిందితుడు అవినాద్ కాళ్లపై కంకిపాడు సీఐ.. కాల్పులు జరిపినట్టు సమాచారం. నిన్న ఉదయం తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల సమీపంలోని దేవరపల్లి ప్రాంతంలో కత్తితో కానిస్టేబుల్‌ను గాయపరిచిన నిందితుడి కోసం పోలీసులు గాలింపు చేపట్టారు. రాత్రి 11 గంటల సమయంలో కోమటికుంటలాకుల డొంకరోడ్డులో నిందితుడు అవినాద్ ఉన్నట్టు తెలుసుకున్న కంకిపాడు, గన్నవరం సీఐలు, సిబ్బందితో కలిసి అక్కడికి చేరుకున్నారు. ఈక్రమంలో నిందితుడు పోలీసులపై కత్తితో దాడి చేసి, రాళ్లు



రువ్వాడు. వెంటనే అప్రమత్తమైన కంకిపాడు సీఐ.. నిందితుడు అవినాద్ కాళ్లపై కాల్పులు జరిపారు. నిందితుడి దాడిలో కానిస్టేబుల్ శ్రీనివాస్ ఛాతిపై గాయాలయ్యాయి. కాల్పుల్లో గాయపడిన నిందితుడిని విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## ఏపీకి మరో 13 నవోదయలు, రెండో ఎయిమ్స్ ఇవ్వండి

- నిర్మలా సీతారామన్‌ను కలిసిన లింగమనేని రమేశ్
- ఏపీలో కేవలం 15 జిల్లాల్లోనే నవోదయ విద్యాలయాలు ఉన్నాయన్న ఎంపీ
- కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావం



ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి, వైద్య విద్యా విస్తరణను ఆకాంక్షిస్తూ జనసేన రాజ్యసభ సభ్యుడు లింగమనేని రమేశ్ కేంద్ర ప్రభుత్వానికి కీలక విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో కొత్తగా మరో 13 జవహర్ నవోదయ విద్యాలయాల ఏర్పాటుతో పాటు, రెండో 'ఎయిమ్స్' (AIIMS) మంజూరుకు అవసరమైన ఆర్థిక సహాయం అందించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మాలా సీతారామన్‌ను కోరారు. ఈ మేరకు ఆమెను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. అనంతరం లింగమనేని మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్రస్తుతం 28 జిల్లాలు ఉండగా కేవలం 15 జిల్లాల్లోనే నవోదయ విద్యాలయాలు ఉన్నాయని వివరించారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడిన ప్రతిభావంతులైన విద్యార్థులకు నాణ్యమైన ఉచిత రెసిడెన్షియల్ విద్యను అందించడంలో ఇవి కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. గతంలో కేంద్ర మంత్రివర్గం ఐదేళ్ల కాలానికి రూ. 2,359.82 కోట్లతో దేశవ్యాప్తంగా 28 నవోదయల ఏర్పాటుకు ఆమోదం తెలిపిన ప్రాతిపదికన, ఏపీలోని మిగిలిన 13 జిల్లాల్లో జేఎన్వీల ఏర్పాటుకు దాదాపు రూ. 1,096 కోట్ల మేర నిధులు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే రాష్ట్రంలో రెండో ఎయిమ్స్ ఏర్పాటు అత్యంత అవసరమని పేర్కొన్నారు. 2014 విభజన తర్వాత మంగళగిరిలో ఒక ఎయిమ్స్ ఏర్పాటైనప్పటికీ, విస్తృతమైన రీతిలో సూపర్ స్పెషాలిటీ వైద్య సేవలు, వైద్య విద్య, పరిశోధనలను విస్తరించేందుకు ప్రాథమిక బడ్జెట్ కేటాయింపులతో డీపీఆర్ తయారు చేసి రెండో ఎయిమ్స్ నిర్మాణానికి మూలధన నిధులు ఇవ్వాలని కోరారు. ఈ నిర్ణయాలు 'వికసిత్ భారత్ @2047', జాతీయ విద్యా విధానం 2020 లక్ష్యాలకు అనుగుణంగా ఉంటాయని, కేంద్ర ప్రభుత్వం ఈ విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

## లారీని ఢీకొట్టిన ప్రైవేటు బస్సు.. 8 మందికి గాయాలు

తుని: కాకినాడ జిల్లా తునిలో మంగళవారం ఉదయం రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. తునిలోని డీమార్ట్ సమీపంలో ఓ ప్రైవేటు బస్సు లారీని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 8మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. క్షతగాత్రులను హుటాహుటిన తుని ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రైవేటు బస్సు ఒడిశా నుంచి విజయవాడ వెళ్తుండగా ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాద సమయంలో బస్సులో 30 మంది ఉన్నట్లు తెలుస్తోంది. ప్రయాణికులకు




స్వల్ప గాయాలు కావడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# 1,931 ఏఎన్ఎం పోస్టులు.. రెండో ప్రొవిజినల్ మెరిట్ లిస్టు విడుదల

తెలంగాణలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్స్ (ఫిమేల్) పోస్టుల భర్తీ ప్రక్రియ తుది దశకు చేరింది. మొత్తం 1,931 పోస్టుల భర్తీకి సంబంధించి మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు (MHSRB) మంగళవారం సాయంత్రం రెండో ప్రొవిజినల్ మెరిట్ లిస్ట్‌ను విడుదల చేసింది. 1:1.25 నిష్పత్తిలో అభ్యర్థులను షార్ట్‌లిస్ట్ చేసింది. ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 16 నుంచి 26వరకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించనున్నారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్ అనంతరం తుది మెరిట్ లిస్ట్, సెలక్షన్ జాబితాలను విడుదల చేస్తారు. ఈ పోస్టుల భర్తీ కోసం 2023 జులై 26న ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ఏడాది మే 14న ప్రొవిజినల్ లిస్ట్ విడుదల చేసి అభ్యర్థుల నుంచి అభ్యంతరాలు స్వీకరించిన అనంతరం జులై 10న తొలి తాత్కాలిక మెరిట్ జాబితాను విడుదల చేశారు. మరోసారి అభ్యంతరాలను స్వీకరించి వాటిని పరిశీలించాక



తాజాగా రెండో తాత్కాలిక జాబితాను విడుదల చేశారు. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ కోసం అభ్యర్థులు హైదరాబాద్‌లోని వెంగళరావునగర్‌లో ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్‌కు వెళ్లాల్సి ఉంటుంది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఈ నెల 28వ తేదీని రిజర్వ్‌డేగా నిర్ణయించారు. తమకు కేటాయించిన తేదీన వెరిఫికేషన్‌కు హాజరు కాలేకపోయిన వారు ఆ రోజు వెళ్లే అవకాశం కల్పించారు.

## నయా మోసం.. ఏటీఎంల వద్ద నగదు తీసుకునే వారే టార్గెట్!

హైదరాబాద్: ఏటీఎంల వద్ద నకిలీ ఫోన్ పే, గూగుల్ పేతో నయా మోసానికి పాల్పడుతున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. అంబర్‌పేట ఎస్‌బీఐ మేనేజర్ ఫిర్యాదుతో కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏటీఎంల వద్ద నగదు తీసుకునే వారినే ఈ ముఠా టార్గెట్ చేసేది. ఫోన్‌పేలో డబ్బులు పంపిస్తాం.. నగదు ఇవ్వండంటూ నిందితులు నమ్మబలికేవారు. నగదు తీసుకున్న తర్వాత



ఫేక్ పేమెంట్ స్క్రీన్ చూపించి మోసం చేసినట్లు పోలీసులు గుర్తించారు. డబ్బు ఖాతాలో జమకాకముందే బాధితుల నుంచి నగదు తీసుకుని నిందితులు పరారయ్యేవారు. ఆగస్టు 19, 22, 24, 28 తేదీల్లో ఇదే తరహా ఫిర్యాదులు పోలీసులకు అందాయి. శివం రోడ్డు ఎస్‌బీఐ ఏటీఎం వద్ద మూడుసార్లు మోసాలకు పాల్పడినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఓ ఘటనలో బాధితుడి నుంచి రూ.5వేలు తీసుకుని నిందితులు పరారయ్యారు. అరెస్టయిన వారిలో విద్యార్థి (19), కారు డ్రైవర్ (23), డెలివరీ వర్కర్ (23) ఉన్నట్లు గుర్తించారు. నిందితుల నుంచి 2 ద్విచక్ర వాహనాలు, 4 మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

## కాంగ్రెస్ అధిష్ఠానం పిలుపు.. ఢిల్లీకి మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్: తెలంగాణ మంత్రి కొండా సురేఖ ఢిల్లీకి బయల్దేరారు. కాంగ్రెస్ అధిష్ఠానం పిలుపు నేపథ్యంలో ఆమె వెళ్లారు. ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో సురేఖ సమావేశం కానున్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అపాయింట్‌మెంట్‌ను కూడా ఆమె కోరారు. ఇటీవల గీసుకొండలో సీఎం రేవంత్‌రెడ్డి, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిపై కొండా సురేఖ కుమార్తె సుస్మిత చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. కుమార్తె వ్యాఖ్యలపై వివరణ ఇవ్వాలని కొండా సురేఖకు



టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ (డీఏసీ) షోకాజ్ నోటీసులు ఇచ్చింది. కమిటీ ఛైర్మన్ మల్లు రవికి ఆమె వివరణ ఇచ్చారు. అనంతరం కొండా సురేఖతో పాటు వనపర్తి వ్యవహారంలో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డిపై రూపొందించిన నివేదికను అధిష్ఠానానికి టీపీసీసీ పంపింది. ఈ పరిణామాల నేపథ్యంలో మంత్రి కొండా సురేఖ ఢిల్లీకి వెళ్లడం.. ఆమె విషయంలో అధిష్ఠానం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోననే ఉత్కంఠ నెలకొంది.

*** మంత్రివర్గ విస్తరణపై జోరుగా ప్రచారం..**

తెలంగాణ మంత్రివర్గ విస్తరణపై హస్తినలో జోరుగా ప్రచారం జరుగుతోంది. మంత్రివర్గంలో మార్పులు, చేర్పులపై కాంగ్రెస్ అధిష్ఠానం కీలక నిర్ణయం తీసుకోవచ్చని రాజకీయ వర్గాల్లో చర్చ కొనసాగుతోంది. నామినేటెడ్ పదవుల భర్తీపైనా నిర్ణయం ఉండే అవకాశముందని కాంగ్రెస్ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. మంత్రివర్గ విస్తరణ, పదవుల పంపకాల ప్రచారం నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ ముఖ్యనేతలు ఢిల్లీ బాటపట్టారు. సీఎం రేవంత్‌రెడ్డి కొద్దిసేపటి క్రితమే ఢిల్లీ చేరుకున్నారు. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఇప్పటికే అక్కడ ఉన్నారు. అయితే పలువురు నేతలు మాత్రం బుధవారం స్వామినాథన్ ఫౌండేషన్‌కి వైఎస్ అవార్డు ప్రదాన కార్యక్రమం కోసం ఢిల్లీ వెళ్తున్నట్లు చెబుతున్నారు.

## కేసీ వేణుగోపాల్‌తో సీఎం రేవంత్ కీలక భేటీ

ఢిల్లీ: ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్‌తో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. రాష్ట్రంలో ఇటీవలి రాజకీయ పరిమాణాలపై ఇరువురి మధ్య కీలక చర్చ జరిగినట్లు సమాచారం. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ, నామినేటెడ్ పోస్టుల భర్తీ అంశాలపై వీరిద్దరి మధ్య చర్చ జరగనున్నట్లు సమాచారం. మంత్రి కొండా సురేఖ, ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డికి క్రమశిక్షణ కమిటీ షోకాజ్ నోటీసులు, వారు ఇచ్చిన వివరణ



తదితర అంశాలపై కేసీ వేణుగోపాల్‌తో రేవంత్ చర్చించినట్లు తెలుస్తోంది.

## రామచందర్‌రావుకు నితిన్ నబీన్ ఫోన్.. రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలపై ఆరా

హైదరాబాద్: భాజపా తెలంగాణ అధ్యక్షుడు రామచందర్‌రావుకు ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ఫోన్ చేసి మాట్లాడారు. సోమవారం తెలంగాణ భాజపా రాష్ట్ర కార్యాలయం గేట్లకు యువజన కాంగ్రెస్ నాయకులు నల్లరంగు వేయడం, భాజపా నేతల హౌస్ అరెస్ట్‌లపై ఆరా తీశారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, కాంగ్రెస్ 1000 రోజుల పాలనా వైఫల్యంపై పోరాడుతుంటే ఓర్వలేక దాడి చేశారని నితిన్ నబీన్‌కు రామచందర్‌రావు చెప్పారు. నల్గొండ భాజపా జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి ఇంటిపై జరిగిన దాడిని సైతం వివరించారు. కాంగ్రెస్



ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలపైన ఈ విధంగానే పోరాడాలని రామచందర్‌రావుకు భాజపా జాతీయ అధ్యక్షుడు సూచించారు. ఏం జరిగినా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. నల్గొండ జిల్లా భాజపా అధ్యక్షుడు వర్షిత్ రెడ్డికి సైతం ఫోన్ చేసి మాట్లాడతానని ఈ సందర్భంగా నితిన్ నబీన్ చెప్పారు. కాంగ్రెస్ అరాచక ముఠాలు దాడులు చేసినప్పుడు మౌనంగా ఉండే ప్రభుత్వ యంత్రాంగం.. బాధితులకు అండగా నిలిచేందుకు భాజపా నాయకులు వస్తే మాత్రం అరెస్టులకు పాల్పడుతోందని నితిన్ నబీన్ ఎక్స్ వేదికగా ఆరోపించారు. రాజ్యాంగం గురించి రాహుల్ గాంధీ చెప్పే నీతులు కేవలం నాటకమేనని, ఈ నియంతృత్వ పాలనకు తెలంగాణ ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు.

## హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు హైకోర్టులో ఊరట

హైదరాబాద్: హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు తెలంగాణ హైకోర్టులో ఊరట లభించింది. శాంతా శ్రీరాం కన్‌స్ట్రక్షన్ కేసులో ఆయనపై సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును డివిజన్ బెంచ్ తాత్కాలికంగా సస్పెండ్ చేసింది. రంగనాథ్‌ను తప్పించి మరో అధికారిని నియమించాలని సింగిల్ జడ్జి గతంలో తీర్పు ఇచ్చారు. దీనిపై రంగనాథ్ డివిజన్ బెంచ్‌లో అప్పీల్ చేశారు. ఆ పిటిషన్‌పై నేడు విచారణ జరిగింది. హైడ్రా కమిషనర్ తరఫున హిమాచల్‌ప్రదేశ్ హైకోర్టు మాజీ సీజే జస్టిస్ రాజీవ్



శక్దర్ వాదనలు వినిపించారు.

## కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై తెలంగాణ ప్రభుత్వానికి ఊరట

హైదరాబాద్: కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై తెలంగాణ ప్రభుత్వానికి హైకోర్టులో ఊరట లభించింది. పథకాల అమలుపై సింగిల్ బెంచ్ ఇచ్చిన స్టేను సీజే ధర్మాసనం రద్దు చేసింది. పథకాలపై స్టే విధించడాన్ని సవాల్‌చేస్తూ ప్రభుత్వం దాఖలుచేసిన అప్పీలుపై హైకోర్టు మంగళవారం విచారణ చేపట్టింది. ఈ పథకాల నిమిత్తం ప్రభుత్వం 2014 నుంచి జారీ చేసిన 8 జీవోలను సవాల్‌చేస్తూ న్యాయవాది విజయ్‌గోపాల్ వ్యక్తిగత హోదాలో దాఖలు చేసిన పిటిషన్‌లో ప్రభుత్వం కౌంటర్ దాఖలు చేయకపోవడంతో పథకాల అమలును నిలిపివేస్తూ సింగిల్ జడ్జి మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ 2014 నుంచి అమలవుతున్న సంక్షేమ పథకాలపై పిటిషన్ దాఖలైందన్నారు. ఈ పథకాల అమలు.. పిటిషనర్‌పై ఎలాంటి ప్రభావం చూపడంలేదని, అతని హక్కులకూ భంగం వాటిల్లలేదని, అంతేకాకుండా పథకం లబ్ధిదారు కూడా కాదన్నారు. ఇది ప్రజాప్రయోజన వ్యాజ్యం కాదని పేర్కొన్నారు. షాదీ ముబారక్ లాంటి పథకాన్ని సుప్రీంకోర్టు అనుమతించిందని, అలాంటిదే కల్యాణలక్ష్మి పథకమన్నారు. ఈ పిటిషన్ సింగిల్ జడ్జి వద్ద విచారణార్హం కాదని, ప్రభుత్వ విధాన నిర్ణయాలను సవాల్ చేస్తూ దాఖలైన



పిటిషన్లను విచారించే పరిధి ఈ డివిజన్ బెంచ్‌కు ఉందన్నారు. పథకం అమలుపై ఉన్న మధ్యంతర ఉత్తర్వులను ఎత్తివేయాలని కోరారు. ఏజీ వాదనలతో ఏకీభవించిన ధర్మాసనం.. స్టేను ఎత్తివేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

## హైదరాబాద్‌లో నిమజ్జనం వివాదం

- : **హైడ్రా వర్సెస్ గణేశ్ ఉత్సవ సమితి**
- **హైదరాబాద్‌లో గణేశ్ నిమజ్జనంపై కొత్త వివాదం**
- **తాము అభివృద్ధి చేసిన చెరువుల్లో నిమజ్జనం కుదరదన్న హైడ్రా**
- **అడ్డుకునే అధికారం హైడ్రాకు లేదన్న గణేశ్ ఉత్సవ సమితి**
- **యథావిధిగా అన్ని చెరువుల్లోనూ నిమజ్జనం చేస్తామని స్పష్టీకరణ**

హైదరాబాద్‌లో వినాయక చవితి పండుగ సమీపిస్తున్న తరుణంలో విగ్రహాల నిమజ్జనంపై మరోసారి వివాదం నెలకొంది. తాము పునరుద్ధరించిన చెరువుల్లో విగ్రహాల నిమజ్జనాన్ని అనుమతించబోమని హైడ్రా స్పష్టం చేయడంతో ఈ వివాదం రాజుకుంది. అయితే, ఈ నిర్ణయాన్ని భాగ్యనగర్ గణేశ్ ఉత్సవ సమితి తీవ్రంగా వ్యతిరేకించింది. హైడ్రా ప్రకటనపై గణేశ్ ఉత్సవ సమితి ఘాటుగా స్పందించింది. విగ్రహాల నిమజ్జనాన్ని



అడ్డుకునే అధికారం హైడ్రాకు లేదని సమితి స్పష్టం చేసింది. దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయాన్ని అడ్డుకోవాలని చూడటం తగదని, ప్రతి ఏటా మాదిరిగానే నగరంలోని అన్ని చెరువుల్లోనూ నిమజ్జనం నిర్వహించి తీరుతామని ఉద్ఘాటించింది. హిందూ పండుగలపై ప్రభుత్వం ఆంక్షలు విధించడం సరికాదని ఉత్సవ సమితి పేర్కొంది. విగ్రహ నిమజ్జనం వల్ల చెరువులు కలుషితమవుతున్నాయనడానికి ఎటువంటి శాస్త్రీయ ఆధారాలు లేవని వాదించింది. ఇరుపక్షాల మధ్య నెలకొన్న ఈ భిన్న వాదనలతో ప్రస్తుతం నిమజ్జనంపై గందరగోళం నెలకొంది.

## తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి: హరీశ్‌రావు

హైదరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో చేసిన మంచి కంటే సృష్టించిన విధ్వంసమే ఎక్కువ అని బీఆర్ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి హరీశ్‌రావు (Harish Rao) విమర్శించారు. దీనికి విద్యార్థుల భవిష్యత్తే ప్రత్యక్ష సాక్ష్యమన్నారు. ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వకుండా విద్యార్థులను వేధిస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ పాలనకు నేటితో వెయ్యి రోజులు పూర్తయ్యాయని పేర్కొంటూ 'ఎక్స్'లో హరీశ్‌రావు పోస్ట్ చేశారు. ఈ సందర్భంగా సీఎం



రేవంత్‌పై విమర్శలు గుప్పించారు. "ప్రతిపక్షాలపై అసత్యాలు ప్రచారం చేయడంపై ఉన్న శ్రద్ధ.. క్షేత్రస్థాయిలో పిల్లలు పడుతున్న గోస మీద ఎందుకు లేదు? ప్రభుత్వం ఫీజుల బకాయిలు చెల్లించకపోవడంతో కాలేజీలు విద్యార్థులను వేధిస్తున్నాయి. కష్టపడి చదువుకున్నా సర్టిఫికెట్లు చేతికి రాక.. అటు ఉద్యోగాలకు, ఇటు పైచదువులకు వెళ్లలేక వారు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల విద్యార్థుల భవిష్యత్తు ప్రశ్నార్థకంగా మారింది. తక్షణమే ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి" అని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డను.. నేను ఎలాంటి తప్పు చేయలేదు

: **కల్వకుంట్ల కవిత భావోద్వేగం**

*** సంకల్ప సభలో కన్నీటి పర్యంతమైన కవిత.. సభలో భావోద్వేగ ప్రసంగం**

*** పదవుల కోసం కొత్త పార్టీ పెట్టలేదు.. తెలంగాణ కోసం పోరాటం ఆగదు**

*** "అమ్మగారింటి వాళ్లు బయటకు నెట్టినా.. అత్తగారిల్లు ఆదరించింది"**

నిజామాబాద్ (ఇందూరు): "నేను ఎలాంటి తప్పు చేయలేదు.. నిప్పులాంటి నిజామాబాద్ బిడ్డను" అని మాజీ ఎంపీ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. నిజామాబాద్‌లో నిర్వహించిన సంకల్ప సభలో ఆమె ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తూ తీవ్ర భావోద్వేగానికి లోనై కన్నీటి పర్యంతమయ్యారు. పదవుల కోసం కాదు - ప్రజల కోసం: "రాజకీయం చేయాలనుకుంటే ఏ పార్టీలోకైనా వెళ్లగలను. మీ దయతో ఇప్పటికే ఎంపీగా, ఎమ్మెల్సీగా పనిచేశాను. కొత్తగా చూడాల్సిన పదవులేమీ లేవు. ఏదో పదవుల కోసమో, స్వార్థం కోసమో పార్టీ పెట్టలేదు. తెలంగాణకు ఇంకా చేయాల్సింది ఎంతో మిగిలి ఉంది కాబట్టే పంతం పట్టి మళ్లీ ఉద్యమ బాట పట్టాను" అని స్పష్టం చేశారు. తీహార్ జైలు - దర్యాప్తు సంస్థల వేధింపులు: "నాలుగేళ్లుగా ఈడీ, సీబీఐ నన్ను తీవ్రంగా వేధించాయి. మన భాష, మన మనుషులు కాని ఢిల్లీకి తీసుకెళ్లి తీహార్ జైలులో పెట్టారు. ఏ తప్పూ చేయని నన్ను జైలుకు పంపితే ధైర్యం వీడలేదు, దారి తప్పలేదు. దేశ చరిత్రలోనే తొలిసారిగా సుప్రీంకోర్టు న్యాయమూర్తి సీబీఐ అధికారిపై ఎంక్వైరీ వేయాలని ఆదేశించిన ఏకైక కేసు నాదే" అని గుర్తుచేశారు. వేదికపై కన్నీటి పర్యంతం: "స్వంత గడ్డపై మీ ముందుకు వచ్చేసరికి బాధ, ఆవేశం కలగలిసి కన్నీళ్లు ఆగడం లేదు. నన్ను పిరికిదాన్ని అనుకోవద్దు. నీతి, నిజాయితీ ఉన్న ఆడబిడ్డల కళ్లల్లో బాధ వచ్చినప్పుడు కన్నీరు తన్నుకొస్తుంది" అంటూ కవిత భావోద్వేగానికి గురయ్యారు. అమ్మగారింటి వాళ్లు వెళ్లగొట్టినా.. అత్తగారిల్లు ఆదరించింది: "పార్టీ కోసం ఎంతో కష్టపడి జైలుకు వెళ్లిన నన్ను నిర్దాక్షిణ్యంగా



బయటకు నెట్టేశారు. కానీ నా అత్తగారు, మామగారు నన్ను కన్నబిడ్డలా చూసుకుని అండగా నిలిచారు. ఇవాళ ఇందూరు గడ్డ మీదికి వచ్చి మీ అందరి మద్దతు కోరుతున్నాను. నా నమ్మకం ఎప్పుడూ మీరే" అని ప్రజలకు చేతులెత్తి నమస్కరించారు. తెలంగాణ కోసం ఇంకా సాధించాల్సింది చాలా ఉందని, ఆ మార్పును ఈ ఇందూరు గడ్డ నుంచే ప్రారంభిస్తానని కవిత పునరుద్ఘాటించారు. సభకు హాజరైన కార్యకర్తలు, మహిళలు కవిత ప్రసంగానికి మద్దతుగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు.

## ఎడులాపురం గ్రామంలో ఉద్రిక్తత.. రెండు వాహనాల దగ్ధం

ఖమ్మం జిల్లాలో అర్ధరాత్రి వేళ గుర్తుతెలియని వ్యక్తులు అలజడి సృష్టించారు. రెండు ద్విచక్ర వాహనాలకు దుండగులు నిప్పంటించిన ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలు రేకెత్తించింది. ఈ ఘటనలో రెండు వాహనాలు పూర్తిగా దగ్ధమయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ఖమ్మం రూరల్ మండలం ఎడులాపురం మున్సిపాలిటీ పరిధిలోని ఎడులాపురం గ్రామంలో సోమవారం అర్ధరాత్రి ఈ దుశ్చర్య చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వేర్పుల ఉపేందర్ (చిన్న) తన ఇంటి బయట నిలిపి ఉంచిన రెండు బైక్‌లకు దుండగులు నిప్పు పెట్టారు. మంటలు భారీగా చెలరేగడంతో ఆ వాహనాలు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. అర్ధరాత్రి సమయంలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడటంతో గ్రామస్థులు అప్రమత్తమై బయటకు వచ్చారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, వారు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు.

# నీట్ నిరసనలు.. విద్యార్థులపై కేసులు కొట్టేసిన సుప్రీంకోర్టు

నీట్ నిరసనలకు సంబంధించి దేశవ్యాప్తంగా విద్యార్థులపై నమోదైన కేసులను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఆర్టికల్ 142 కింద విస్తృత అధికారాలను ఉపయోగించి ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసింది. నిరసనలు చేపట్టిన వారిలో తీవ్ర నేర చరిత్ర కలిగి ఉన్న 2,873 మందిపై కొత్తగా కేసుల నమోదుకు కేంద్రం, ఢిల్లీ పోలీసులకు అనుమతినిచ్చింది. అదేవిధంగా.. ఆత్మహత్య చేసుకున్న నీట్ విద్యార్థుల కుటుంబాలకు మూడు నెలల్లోగా పరిహారం అందించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో సెప్టెంబర్ 5న నిర్వహించనున్న నిరసన కార్యక్రమాన్ని విరమించుకుంటున్నట్లు సర్వోన్నత న్యాయస్థానానికి కాక్రోచ్ జనతా పార్టీ (CJP)



తెలిపింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన సుప్రీం ధర్మాసనం ఎదుట ఈ అంశంపై వాదనలు సాగాయి. జులై 2025 మధ్య దేశవ్యాప్తంగా నీట్ నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసేందుకు సుప్రీంకోర్టు తన అధికారాలను ఉపయోగించాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు. నీట్ రద్దు అనంతరం ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లిస్తామంటూ సీజేపీ ప్రతినిధులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు కేంద్రం కట్టుబడి ఉందని, దీనికి సంబంధించిన విధివిధానాల ఖరారుకు మూడు నెలల సమయం కోరారు. దీనికి అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఆ కేసులను కొట్టేసింది.

## అంత్యక్రియలు పూర్తైన నెలరోజులకు తిరిగొచ్చిన కుమారుడు

ఒడిశాలోని దేంకానాల్ జిల్లా బార్షింగాలో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. తమ కుమారుడు తప్పిపోయాడని ఫిర్యాదు చేసిన ఓ కుటుంబానికి.. స్థానిక పోలీసులు ఓ మృతదేహాన్ని అప్పగించారు. అది తమ కుమారుడే అనుకొని భావించి అంత్యక్రియలు చేశారు. చనిపోయాడనుకున్న కుమారుడు.. నెల తర్వాత వారి ఇంటికి తిరిగి రావడం చూసి కుటుంబీకులు సహా గ్రామస్థులు ఆశ్చర్యానికి గురయ్యారు. బార్షింగా



గ్రామానికి చెందిన సనాతన్ నాయక్ (29)కు మానసిక ఆరోగ్యం బాగాలేదు. తరచూ ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయి కొన్ని రోజుల తర్వాత తిరిగి వచ్చేవాడు. కానీ, జులైలో అలా వెళ్లిన అతడు మళ్లీ రాలేదు. దీంతో కంగారుపడిన కుటుంబీకులు స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో సమీపంలోని కునువా గ్రామంలో వరద నీటిలో కొట్టుకువచ్చిన ఓ మృతదేహం సనాతన్‌దేనని పోలీసులు భావించి అతడి కుటుంబీకులకు అప్పగించారు. దీంతో వాళ్లు మృతదేహం తమ కుమారుడిదే అనుకొని అంత్యక్రియలు నిర్వహించారు. ఇవన్నీ పూర్తైన నెల రోజులకు సనాతన్ ఇంటికి తిరిగి రావడంతో వారంతా ఆశ్చర్యపోయారు. అంత్యక్రియలు నిర్వహించిన ఆ మృతదేహం ఎవరిదనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## మమతా బెనర్జీ మేనకోడలు అనుమానాస్పద మృతి

బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మేనకోడలు బృష్టి ముఖర్జీ ఘటక్ (28) అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. రాంపూర్‌హట్‌లోని తమ నివాసంలో మంగళవారం మధ్యాహ్నం ఉరి వేసుకున్నారు. గమనించిన కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా..అప్పటికే ఆమె ప్రాణాలు కోల్పోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బృష్టి ముఖర్జీ కి ఆమె భర్తతో విడాకుల కేసు విచారణ దశలో ఉందని కుటుంబసభ్యులు వెల్లడించారు. దీంతో కొంతకాలంగా ఆమె డిప్రెషన్‌తో బాధపడుతున్నట్లు పేర్కొన్నారు. మమతా బెనర్జీ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఉద్యోగ నియామక ప్రక్రియలో అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వచ్చిన విషయం తెలిసిందే. బృష్టి కూడా అక్రమంగా ఉద్యోగం



పొందారని ఆరోపణలు వచ్చాయి. ఆ నియామకాలను సుప్రీం కోర్టు రద్దు చేయడంతో ఆమె ఉద్యోగం కోల్పోయారు.

## నీట్ నిరసనలు.. విద్యార్థులపై కేసులు కొట్టేసిన సుప్రీంకోర్టు

నీట్ నిరసనలకు సంబంధించి దేశవ్యాప్తంగా విద్యార్థులపై నమోదైన కేసులను సుప్రీంకోర్టు కొట్టేసింది. ఆర్టికల్ 142 కింద విస్తృత అధికారాలను ఉపయోగించి ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసింది. నిరసనలు చేపట్టిన వారిలో తీవ్ర నేర చరిత్ర కలిగి ఉన్న 2,873 మందిపై కొత్తగా కేసుల నమోదుకు కేంద్రం, ఢిల్లీ పోలీసులకు అనుమతినిచ్చింది. అదేవిధంగా.. ఆత్మహత్య చేసుకున్న నీట్ విద్యార్థుల కుటుంబాలకు మూడు నెలల్లోగా పరిహారం అందించాలని ఆదేశాలు జారీ చేసింది. ఈ పరిణామాల నేపథ్యంలో సెప్టెంబర్ 5న నిర్వహించనున్న నిరసన



కార్యక్రమాన్ని విరమించుకుంటున్నట్లు సర్వోన్నత న్యాయస్థానానికి కాక్రోచ్ జనతా పార్టీ (CJP) తెలిపింది. సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీ, జస్టిస్ వి.మోహనలతో కూడిన సుప్రీం ధర్మాసనం ఎదుట ఈ అంశంపై వాదనలు సాగాయి. జులై 2025 మధ్య దేశవ్యాప్తంగా నీట్ నిరసనకారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌లను రద్దు చేసేందుకు సుప్రీంకోర్టు తన అధికారాలను ఉపయోగించాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా కోరారు. నీట్ రద్దు అనంతరం ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం చెల్లిస్తామంటూ సీజేపీ ప్రతినిధులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకునేందుకు కేంద్రం కట్టుబడి ఉందని, దీనికి సంబంధించిన విధివిధానాల ఖరారుకు మూడు నెలల సమయం కోరారు. దీనికి అనుమతిస్తూ సుప్రీంకోర్టు ఆ కేసులను కొట్టేసింది.

## బ్యాంకు ఆడిట్‌లో బయటపడిన రూ.7.40 కోట్ల నకిలీ నోట్లు

ఉత్తర్‌ప్రదేశ్ సహారన్‌పూర్‌లోని పంజాబ్ నేషనల్ బ్యాంక్‌లోని (PNB) కరెన్సీ చెస్ట్‌లో సుమారు రూ.7.40 కోట్ల నకిలీ నోట్లు బయటపడ్డాయి. ఈ ఘటనకు సంబంధించి ముగ్గురు బ్యాంకు అధికారులతో పాటు ఓ హౌస్‌కీపర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో పీఎన్‌బీ సీనియర్ డివిజనల్ మేనేజర్ రవి కుమార్, కరెన్సీ చెస్ట్ మేనేజర్లు సుశీల్ శర్మ, అమిత్ కుమార్‌లను బ్యాంకు సస్పెండ్ చేసింది. కరెన్సీ చెస్ట్ నుంచి బ్యాంకు ప్రధాన కార్యాలయానికి పంపిన నగదులో రూ.4.30 లక్షలు తగ్గినట్లు అధికారులు గుర్తించారు. దీంతో పీఎన్‌బీ మేరఠ్ శాఖకు సమాచారం అందించారు. వెంటనే బ్యాంకు నోడల్ అధికారి అక్కడికి చేరుకుని విచారణ చేపట్టారు. సీసీటీవీ దృశ్యాలను పరిశీలించగా.. విశాల్ అనే పార్ట్‌టైమ్ హౌస్‌కీపర్



నోట్ల కట్టల నుంచి నగదు తీస్తున్నట్లు గుర్తించారు. దీంతో బ్యాంకు అధికారులు కరెన్సీ చెస్ట్‌లో ప్రత్యేక ఆడిట్ నిర్వహించారు. ఇందులో పలు అవకతవకలతో పాటు సుమారు రూ.7.40 కోట్ల విలువైన నకిలీ కరెన్సీ ఉన్నట్లు గుర్తించారు. ఈ ఘటనకు సంబంధించి ప్రత్యేక విచారణ బృందాన్ని (SIT) ఏర్పాటు చేసినట్లు డీఐజీ అభిషేక్ తెలిపారు. ఈ నకిలీ కరెన్సీని ఎవరు చేర్చారనే విషయంపై దర్యాప్తు కొనసాగుతోంది

## విమానం గాల్లో ఉండగా.. ఇంజిన్ వైఫల్యం

గాల్లో ఉన్న సమయంలో ఇండిగో విమానం ఇంజిన్‌లో సమస్య తలెత్తింది. దీంతో విమానాన్ని అత్యవసర ల్యాండింగ్ చేశారు. ఈ ఘటన గోవాలో చోటుచేసుకుంది. ఆ సమయంలో విమానంలో 220 మంది ప్రయాణికులు ఉన్నారు. ఉదయం 9:16 గంటలకు ఇండిగో విమానం గోవా నుంచి ఢిల్లీ బయల్దేరింది. గాల్లో ప్రయాణిస్తున్న సమయంలో ఓ ఇంజిన్‌లో సమస్య తలెత్తినట్లు గుర్తించిన పైలట్లు ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ATC)




కు సమాచారం ఇచ్చారు. దీంతో గోవా ఎయిర్‌పోర్టులో అధికారులు అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. విమానాన్ని వెనక్కి మళ్లించిన పైలట్లు విమానాశ్రయంలో సురక్షితంగా ల్యాండ్ చేశారు. దీంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం మరో విమానంలో ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చారు.

## నేపాల్ వరదల్లో తల్లిదండ్రుల గల్లంతు.. కన్నీటితోనే నీట్ పరీక్ష

నేపాల్ వరదల్లో తల్లిదండ్రులు గల్లంతైనా.. ఆ బాధను అదిమిపెట్టి ఓ యువతి నీట్ పరీక్ష రాసింది. కైలాస మానసరోవర యాత్ర కోసం వెళ్లిన వందలాది మంది భారతీయులు నేపాల్ వరదల్లో గల్లంతయ్యారు. ఈ యాత్రకు వెళ్లిన తన తల్లిదండ్రులు కూడా చిక్కుకుపోయారని తన్వి అనే నీట్ అభ్యర్థి సోషల్ మీడియాలో ఆవేదన వ్యక్తం చేశారు. తన తల్లిదండ్రులు వెంకట్రామ్ అన్నందేవర, అనఘ 67 మందితో కూడిన బృందంతో కలిసి కైలాస యాత్రకు వెళ్లినట్లు తెలిపారు. వారు నేపాల్‌లోని ఇమిగ్రేషన్ సెంటర్ వద్ద ఉన్నప్పుడు





చివరిసారిగా తనతో మాట్లాడారని తెలిపింది. ప్రస్తుతం వారు తన పక్కన లేకపోయినా.. వారి కోరిక మేరకు నీట్ పరీక్ష రాశానని చెప్పారు. 'మూడు గంటల పరీక్ష సమయంలో దాదాపు సగం సమయం కన్నీళ్లతోనే గడిపాను. అడ్మిట్ కార్డుపై ఉన్న ఫొటోను మా నాన్నే తీశారు. పరీక్ష రాస్తున్నప్పుడు అది కనిపించి, ఆయన పదే పదే గుర్తుకు రావడంతో తీవ్ర భావోద్వేగానికి గురయ్యాను. మానసికంగా ఎంతో సంఘర్షణకు గురైనప్పటికీ.. అమ్మానాన్నల కోరిక మేరకు ఈ పరీక్ష తప్పకుండా రాయాలని నిర్ణయించుకున్నా. నా భవిష్యత్తు కోసం వారు ఎన్నో కలలు కన్నారు. నేను ఏ పరీక్షకు వెళ్లినా.. అందులో మంచి మార్కులు సాధించాలని కోరుతూ అమ్మ ప్రతిసారి పెరుగులో పంచదార కలిపి తినిపించేది. కానీ ఇప్పుడు ఆమె నా పక్కన లేకపోవడం నన్ను మరింత కుంగదీసింది. వారు సురక్షితంగా తిరిగి వస్తారనే నమ్మకంతో ఎదురు చూస్తున్నా' అని తన్వి కన్నీరు పెట్టుకున్నారు.

## జల వివాదంపై కోర్టు తీర్పును తోసిపుచ్చిన భారత్.. పాక్ నోట మళ్లీ అదే మాట..!

కిర్గిస్థాన్‌లో జరుగుతున్న షాంఘై సహకార సంస్థ (SCO) సదస్సును పాకిస్థాన్ మరోసారి భారత్‌పై ఆరోపణలకు వేదికగా మార్చుకుంది. సింధు జలాల ఒప్పందాన్ని ప్రస్తావించిన పాక్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ నీటిని రాజకీయ ఘర్షణలకు ముడి పెట్టొద్దంటూ మళ్లీ పాత పాటే పాడారు. దీంతో అంతర్జాతీయ మద్దతు కూడగట్టేందుకు పాక్ ఎంతకైనా దిగజారుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పహల్గామ్ ఉగ్రదాడి తర్వాత సింధు జలాల ఒప్పందాన్ని భారత్ నిలిపివేసింది. తాజాగా ది హేగ్‌లోని మధ్యవర్తిత్వ కోర్టు ఇచ్చిన తీర్పును భారత్ తోసిపుచ్చింది. ఆ కోర్టుకు ఈ వ్యవహారంలో అధికార పరిధే లేదని స్పష్టం చేసింది. షాంఘై సహకార సంస్థ సదస్సుపై ప్రధాని నరేంద్ర మోదీ ఉగ్రవాద సమస్యను మరోసారి ప్రస్తావించారు.



ఉగ్రవాదానికి నిధులు, మద్దతు, సురక్షిత స్థావరాలు కల్పించే వ్యవస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్‌సీవో దేశాలకు పిలుపునిచ్చారు. దీంతో ఒకవైపు పాక్ నీటి అంశాన్ని అంతర్జాతీయ సమస్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తే.. మరోవైపు ఉగ్రవాదమే ప్రాంతీయ శాంతికి ప్రధాన ముప్పు అని భారత్ బలంగా చాటింది.

## 1,000 దాటిన మరణాలు.. 700 మృతదేహాలు సామూహిక ఖననం

నేపాల్ వరదల్లో గల్లంతైన వారి కోసం ఆరో రోజూ సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో ఇప్పటివరకు 1003 మృతదేహాలను సహాయక బృందాలు వెలికితీశాయి. సుమారు 4వేల మంది ఆచూకీ ఇంకా లభించలేదు. వీరిలో 583 మంది విదేశీయులు, 83 మంది భద్రతా సిబ్బంది ఉన్నారు. ఇప్పటివరకు 12 వేల మందిని భద్రతా దళాలు రక్షించినట్లు అధికారులు వెల్లడించారు. మరోవైపు, టిబెట్‌లో 16 మంది ప్రాణాలు కోల్పోగా.. 550 మంది ఆచూకీ లభించలేదని చైనా మీడియా పేర్కొంది.



**700 మృతదేహాలు ఖననం..**

ఆయా ప్రాంతాల్లో వెలికితీసిన మృతదేహాలను దేశవ్యాప్తంగా 21 ఆసుపత్రులకు తరలిస్తున్నారు. గల్లంతైన వారి ఫొటోలు పట్టుకొని బాధిత కుటుంబాలు వైద్య కేంద్రాల వద్ద వేచిచూస్తున్నాయి. మృతదేహాల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో వాటిని భద్రపరిచేందుకు ఏర్పాట్లు లేక ఇబ్బందికర పరిస్థితి నెలకొంది. అయితే, అవి గుర్తించలేని స్థితిలో ఉండటం, ఒక్కోచోట కొన్ని శరీర భాగాలు మాత్రమే లభ్యం అవుతుండడంతో అవి ఎవరివనేది నిర్ధరించడం సవాలుగా మారుతోంది. ఇప్పటివరకు వెలికితీసిన మృతదేహాల్లో 60 మాత్రమే సంబంధిత కుటుంబాలకు అందజేయగా.. దాదాపు 700 మృతదేహాల నమూనాలను భద్రపరచిన అనంతరం వాటిని సామూహికంగా ఖననం చేశారు.

**రెస్క్యూలో వేలాది మంది..**

ప్రస్తుతం నేపాల్‌లోని పలు ప్రాంతాల్లో వర్షాలు కురుస్తుండగా నదుల్లో నీటి మట్టం పెరుగుతోంది. మరిన్ని వరదలు సంభవించవచ్చనే హెచ్చరికలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో ప్రభావిత ప్రాంతాల్లో దాదాపు 21వేల మంది భద్రతా సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్‌లో నిమగ్నమయ్యారు. హెలికాప్టర్ల సాయంతో బాధితులను సురక్షిత ప్రాంతాలకు తరలించడం.. రోడ్లు, వంతెనలు కూలిపోయిన ప్రాంతాల్లోని ప్రజలకు ఆహారం సరఫరా తదితర కార్యక్రమాలు చేపట్టారు.

## విద్యార్థులు కెనడా వెళ్లాలంటే మరింత సొమ్ము అవసరం..!

కెనడా వీసా కోసం దరఖాస్తు చేసుకుంటున్న విదేశీ విద్యార్థులకు అక్కడి ప్రభుత్వం కొత్త నిబంధన పెట్టింది. సెప్టెంబర్ 1వ తేదీ నుంచి ఏడాది జీవన వ్యయాల కోసం 23,448 కెనడా డాలర్లు (దాదాపు రూ.16లక్షలు) దరఖాస్తుల్లో చూపాల్సిందేనని పేర్కొంది. ఈ మేరకు ఇమిగ్రేషన్, రెఫ్యూజీస్ అండ్ సిటిజన్‌షిప్ కెనడా నిబంధనల్లో మార్పు చేసింది. క్యూబెక్ మినహా అన్ని రాష్ట్రాలకు వచ్చే వారు దీనిని పాటించాల్సి ఉంటుంది. కెనడాలో ఉన్నత చదువుల కోసం వెళ్లే విదేశీ విద్యార్థులు ఏడాది పాటు ఆర్థిక అవసరాలకు సరిపడా నిధులు తమ దగ్గర ఉన్నట్లు ఇమిగ్రేషన్ అధికారులకు చూపించాల్సి ఉంటుంది. ఈ పరిమితి (ట్యూషన్ ఫీజు, ట్రావెల్ ఖర్చులు కాకుండా) ప్రస్తుతం ఒక్కో




వ్యక్తికి ఏడాదికి 22,895 కెనడియన్ డాలర్లుగా ఉండగా.. ఈ ఏడాది సెప్టెంబర్ 1 నుంచి 23,448 డాలర్లకు పెంచింది. కుటుంబంతో ప్రయాణించే విద్యార్థులపైనా మరింత భారం పడనుంది. దరఖాస్తుదారుతో సహా ఇద్దరు కుటుంబ సభ్యులు ఉంటే వారు అప్లికేషన్‌లో 29,192 కెనడియన్ డాలర్లు (దాదాపు రూ.19లక్షలు) చెల్లించాల్సి ఉంటుంది.




## ఐస్‌క్రీమ్ మార్కెట్‌లోకి రిలయన్స్.. ₹10 నుంచే లభ్యం




రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు చెందిన ఎఫ్ఎంసీజీ విభాగం రిలయన్స్ కన్జూమర్ ప్రొడక్ట్స్ లిమిటెడ్ మరో కొత్త వ్యాపారంలోకి ప్రవేశించింది. ఇప్పటికే శీతల పానీయాల విభాగంలో ఉనికి చాటుతున్న రిలయన్స్.. తన వ్యాపారాన్ని మరింత విస్తరిస్తూ ఐస్‌క్రీమ్ మార్కెట్‌లోకి అడుగుపెట్టింది. ఇందులో భాగంగా 'బాంబే క్రీమరీ' బ్రాండ్‌ను ఆవిష్కరించింది. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేసింది. డెయిరీ క్రీమ్‌తో తయారుచేసిన ఐస్‌క్రీమ్‌లను ఈ బ్రాండ్ కింద విక్రయించనున్నట్లు రిలయన్స్ వెల్లడించింది. కోన్స్, కప్స్, టబ్స్, బార్స్, స్టిక్స్ రూపంలో వీటిని విక్రయిస్తామని తెలిపింది. వీటి ధరలు రూ.10 నుంచి ప్రారంభమవుతాయని పేర్కొంది. తొలుత పశ్చిమ రాష్ట్రాల్లో ఇవి అందుబాటులోకి వస్తాయని, క్రమంగా దేశవ్యాప్తంగా వినియోగదారులకు తేనున్నట్లు ప్రకటించింది. అందుబాటు ధరలో బాంబే క్రీమరీ ద్వారా అసలైన ఐస్‌క్రీమ్ రుచిని భారతీయులకు అందించడం తమ ముఖ్య ఉద్దేశమని రిలయన్స్ కన్జూమర్ ప్రొడక్ట్స్ డైరెక్టర్ టి కృష్ణ కుమార్ తెలిపారు.

## ప్రయాణాలు మరింత భారం
## సీఎన్‌జీ, జెట్ ఇంధన ధరలు పెంపు



పశ్చిమాసియా ఘర్షణలు ఎప్పుడు ముగుస్తాయో తెలియని అనిశ్చితి నెలకొంది. దాంతో ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన హర్మ్యూజ్ జలసంధిలో అంతరాయాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో మరోసారి సీఎన్‌జీ ధరలు పెరిగాయి. విమానాల్లో ఉపయోగించే ఏవియేషన్ టర్బైన్ ఫ్యూయల్ ధరలో కూడా వరుసగా రెండోనెలలో పెంపు నమోదైంది. మంగళవారం మహానగర్ గ్యాస్ లిమిటెడ్ సీఎన్‌జీ ధరను కేజీకి రూ.2 చొప్పున పెంచింది. దీంతో ముంబయి, పరిసర ప్రాంతాల్లో కేజీ గ్యాస్ ధర రూ.88కి ఎగబాకింది. డొమెస్టిక్ పైప్డ్ నేచురల్ గ్యాస్ స్టాండర్డ్ క్యూబిక్ మీటర్ (SCM)కు ఒక రూపాయి చొప్పున పెరిగింది. ఈ ధరలు నేటినుంచే అమల్లోకి వచ్చాయి. పశ్చిమాసియాలో నెలకొన్న ఘర్షణల నేపథ్యంలో అంతర్జాతీయ విపణిలో ధరలకు అనుగుణంగా ఈ ఇంధనాల రేట్లను సవరించినట్లు ఎంజీఎల్ వెల్లడించింది.

# వార్షికోత్సవం వేళ LIC నుంచి రెండు కొత్త ప్లాన్లు

ప్రభుత్వరంగ జీవిత బీమా సంస్థ ఎల్ఐసీ రెండు కొత్త ప్లాన్లను లాంచ్ చేసింది. ఎల్ఐసీ 70వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని బీమా ప్లాటినమ్, జీవన్ రక్ష పేరిట రెండు కొత్త ప్లాన్లను ప్రకటించింది. సెప్టెంబర్ 7 నుంచి ఈ పాలసీలు అందుబాటులోకి రానున్నాయి. ఆ ప్లాన్ల వివరాలు ఇవీ..

**ఎల్ఐసీ బీమా ప్లాటినమ్ (ప్లాన్ నం 770)**

బీమా ప్లాటినమ్ నాన్ లింక్డ్, నాన్ పార్టిసిపేటింగ్, ఇండివిడ్యువల్ ప్లాన్. ఇది పొదుపుతో పాటు మీ కుటుంబానికి ఆర్థిక రక్షణ కూడా కల్పిస్తుంది. కచ్చితమైన ముందస్తు హామీతో కూడిన రాబడులు లభిస్తాయి. ప్రీమియం చెల్లింపు కాలవ్యవధిలో ప్రతి వెయ్యి రూపాయలకు రూ.70 చొప్పున గ్యారెంటీడ్ అడిషన్ చెల్లిస్తారు. ఈ పాలసీ తీసుకునేందుకు కనీస వయసు 28 ఏళ్లు. గరిష్ఠ వయసు 75 ఏళ్లుగా నిర్ణయించారు. 7, 10, 12, 15, 18 ప్రీమియం చెల్లింపు కాలవ్యవధిని ఎంచుకోవచ్చు. 17, 20,




22, 25, 28 ఏళ్ల పాటు పాలసీ గడువు ఉంటుంది. కనీస బీమా హామీ మొత్తం రూ.3 లక్షలుగా నిర్ణయించారు. గరిష్ఠ మొత్తంపై పరిమితి లేదు. పాలసీ మెచ్యూరిటీ సమయానికి పాలసీదారుడు జీవించి ఉంటే బేసిక్ సమ్‌అష్యూర్డ్, గ్యారెంటీడ్ అడిషన్లు చెల్లిస్తారు. జరగరానిది ఏదైనా జరిగితే వార్షిక ప్రీమియానికి 11 రెట్లు లేదా బేసిక్ సమ్ అష్యూర్డ్, గ్యారెంటీడ్ అడిషన్లలో ఏది ఎక్కువైతే అది చెల్లిస్తారు. ఎల్ఐసీ పాలసీదారులకు రిబేటు లభిస్తుంది. రుణ సదుపాయం కూడా ఉంది. రైడర్లు జోడించుకోవచ్చు. బేసిక్ సమ్ అష్యూర్డ్‌లో 10 శాతం చొప్పున రెగ్యులర్ ఇన్‌కమ్ కింద ఏటా తీసుకునే వెసులుబాటూ ఉంది.

**జీవన్ రక్ష (ప్లాన్ నం 894)**

ఎల్ఐసీ జీవన్ రక్ష నాన్‌పార్టిసిపేటింగ్, నాన్ లింక్డ్ ప్యూర్ రిస్క్ ప్లాన్. ఇది మీ కుటుంబానికి ఆర్థిక రక్షణ కల్పిస్తుంది. పాలసీదారుడికి జరగరానిది ఏదైనా జరిగితే అండగా నిలుస్తుంది. ఈ ప్లాన్ తీసుకోవడానికి కనీస వయసు 18 ఏళ్లు, గరిష్ఠ వయసును 45 ఏళ్లుగా నిర్ణయించారు. కనీస బీమా హామీ మొత్తం రూ.5 లక్షలు, గరిష్ఠంగా రూ.24 లక్షలు వరకు తీసుకోవచ్చు. సింగిల్ ప్రీమియం, రెగ్యులర్ ప్రీమియం, లిమిటెడ్ ప్రీమియం ఆప్షన్లలో లభిస్తుంది. మహిళలకు ప్రత్యేక రేట్లు వర్తిస్తాయి. రైడర్లు జోడించుకోవచ్చు.

# అయిష్టంగానే వచ్చి.. 'యాపిల్'కు టాప్ గేర్.. టిమ్ కుక్ ప్రస్థానమిదీ!




హాయిగా సాగిపోతున్న ఉద్యోగం.. అప్పటికే దివాలా అంచున ఉన్న కంపెనీ నుంచి జాబ్ ఆఫర్. ఇలాంటి పరిస్థితుల్లో ఉన్న ఉద్యోగాన్ని వదులుకునే సాహసం ఎవరూ చేయరు. కానీ, ఒక్క భేటీ ఆ ఉద్యోగి నిర్ణయాన్ని మార్చింది. తర్వాతి కాలంలో ఆయన్ను కంపెనీకి సీఈఓను చేసింది. కంపెనీని సైతం ప్రపంచంలోనే అత్యంత విలువైన వాటిల్లో ఒకటిగా నిలిపింది. ఆ ఉద్యోగే టిమ్ కుక్. ఆయనతో భేటీ అయిన వ్యక్తే యాపిల్ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్. యాపిల్‌కు సుదీర్ఘకాలం పాటు సీఈఓగా వ్యవహరించిన టిమ్ కుక్ ఆ బాధ్యతల నుంచి వైదొలిగిన వేళ.. ఆ సంస్థలోకి ఆయన రాక ఎలా సాగిందనేది చూద్దాం. అది 1998. టిమ్ కుక్.. కాంపాక్ అనే కంపెనీలో మంచి హోదాలో పనిచేస్తున్నారు. ఆ సమయంలో కాంపాక్ విలువ 30 బిలియన్ డాలర్లు. యాపిల్ కంపెనీ విలువ 3 బిలియన్ డాలర్లు మాత్రమే. పైగా దివాలా అంచున ఉంది. ఆ సమయంలో యాపిల్ నుంచి వచ్చిన జాబ్ ఆఫర్‌ను కుక్ తిరస్కరించారు. తాను పనిచేస్తున్న ఉద్యోగంలోనే తనకు ఆనందం ఉందని తెగేసి చెప్పారు. 2014లో ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో టిమ్ కుక్ ఈ విషయాన్ని చెప్పుకొచ్చారు.

**ఆ ఒక్క భేటీ మార్చింది**

జాబ్ ఆఫర్‌ను తిరస్కరించినా యాపిల్ నుంచి కుక్‌కు కాల్స్ వస్తూనే ఉన్నాయి. స్టీవ్ జాబ్స్‌తో భేటీ అని చెప్పగానే టిమ్ కుక్ కూడా కాస్త మెత్తబడ్డారు. దీంతో ఆయనపై ఉన్న గౌరవంతో సమావేశానికి అంగీకరించారు. వాస్తవానికి యాపిల్‌లో చేరాలనే ఉద్దేశమేదీ అప్పటి వరకు టిమ్‌కుక్‌కు లేదు. భేటీ ప్రారంభమైన కాసేపటికే జాబ్స్ తన ఆలోచనలను కుక్‌తో పంచుకోవడం ప్రారంభించారు. కంపెనీని ఎలా ముందుకు నడిపించాలి? వినియోగదారులను ఎలా ఆకట్టుకోవాలి? అనే అంశాలపై మాట్లాడడం మొదలుపెట్టారు. జాబ్స్ విజన్ కుక్‌ను అమితంగా ఆకట్టుకుంది. దీంతో కాంపాక్‌ను వీడి యాపిల్‌లో చేరాలని కుక్ నిర్ణయించుకున్నారు. స్నేహితులు, సలహాదారులు వారించినా యాపిల్‌లో చేరేందుకే మొగ్గు చూపారు. అలా 1998లో యాపిల్‌లో సీనియర్ వైస్‌ప్రెసిడెంట్‌గా చేరారు.

**3 దశాబ్దాల ప్రస్థానం.. 15 ఏళ్లుగా సీఈఓ**

యాపిల్‌లో టిమ్‌కుక్‌ది మూడు దశాబ్దాల ప్రస్థానం. వివిధ హోదాల్లో పనిచేశారు. 2011లో స్టీవ్ జాబ్స్ నుంచి నాయత్వ బాధ్యతలు చేపట్టారు. 15 ఏళ్లపాటు ఆ బాధ్యతల్లో కొనసాగారు. ఈ సుదీర్ఘ ప్రయాణంలో ఎన్నో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టారు. స్టీవ్ అప్పగించిన కంపెనీని అంతే బాధ్యతాయుతంగా ముందుకు నడిపించే వ్యక్తి కోసం ఏళ్ల పాటు అన్వేషించి.. టిమ్‌కుక్ తర్వాత ఆ బాధ్యతల్లో జాన్ టెర్నస్‌ను ఎంపిక చేశారు. కొత్త సీఈఓకు బాధ్యతలు అప్పగించి.. ఇకపై కంపెనీ ఎగ్జిక్యూటివ్ చైర్మన్‌గా కుక్ కొనసాగనున్నారు.

**ఆవిష్కరణలు.. కొత్త పుంతలు**

* టిమ్ కుక్ హయాంలో యాపిల్ కంపెనీ రికార్డు వృద్ధి సాధించింది. ఆయన బాధ్యతలు చేపట్టే నాటికి కంపెనీ విలువ దాదాపు 350 బిలియన్ డాలర్లు ఉండగా.. ఆయన నాయకత్వంలో ఏకంగా 4.5 ట్రిలియన్ డాలర్లను దాటింది. ఈ కాలంలో యాపిల్ షేర్లు 2,275 శాతం మేర పెరిగాయి.
* కేవలం ఉత్పత్తుల తయారీకే కాకుండా యాప్ స్టోర్, ఐక్లౌడ్, యాపిల్ మ్యూజిక్, యాపిల్ పే, యాపిల్ టీవీ+ వంటి సేవలపై టిమ్ కుక్ దృష్టిసారించారు.
* 2015లో ఈసీజీ, ఫాల్ డిటెక్షన్ ఫీచర్లతో విడుదలైన యాపిల్ వాచ్, 2016లో విడుదలైన ఎయిర్‌పాడ్స్ మార్కెట్లో సంచలనం సృష్టించాయి.

# బిగ్‌ట్విస్ట్.. ముంబయితోనే హార్దిక్.. కెప్టెన్‌గా తిలక్ వర్మ!



ముంబయి ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్య ట్రేడింగ్‌పై కొత్త అంశం తెరపైకి వచ్చింది. హార్దిక్‌ను ట్రేడ్ చేయకుండా ఆటగాడిగా జట్టులో కొనసాగించి, కెప్టెన్సీ మరొకరికి అప్పగించాలని ముంబయి భావిస్తోందట. పాండ్యను ట్రేడ్ చేయడం కోసం కోల్‌కతా నైట్‌రైడర్స్‌ను ముంబయి ఇండియన్స్ సంప్రదించిందట. అయితే, సరైన ప్రత్యామ్నాయ ఆటగాడు లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. కెప్టెన్‌గా కొత్తవారిని ఎంపిక చేసేందుకు ముంబయి కసరత్తు చేస్తోందని సమాచారం. కొత్త సారథి ఎంపికలో రోహిత్ శర్మ కీలకపాత్ర పోషిస్తున్నాడని, ఇప్పటికే జట్టు యాజమాన్యంతో చర్చలు జరుపుతున్నట్లు టాక్ నడుస్తోంది. కెప్టెన్సీ రేసులో సీనియర్ ప్లేయర్ జస్‌ప్రీత్ బుమ్రాతోపాటు యువ ఆటగాడు తిలక్ వర్మ పేర్లు వినిపిస్తున్నాయి. అయితే, జట్టు దీర్ఘకాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని తిలక్ వర్మ వైపే మొగ్గు చూపే అవకాశాలున్నాయని సమాచారం. "హార్దిక్‌ను అసలు ట్రేడ్ చేయకపోయినా ఆశ్చర్యపోకండి. ఈ విషయమై ఆటగాడితో చర్చలు కూడా జరిగాయి. ఒక ట్రేడ్ జరగాలంటే చాలా విషయాలు ఒక కొలిక్కి రావాలి. ఇది అంత తేలికైన విషయం కాదు" అని ఫ్రాంఛైజీ సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. మహేల జయవర్ధనెను కోచ్‌గా తొలగిస్తారని మొన్నటివరకు వార్తలు వచ్చాయి. అయితే, వచ్చే సీజన్‌కు అతనే కోచ్‌గా ఉండే అవకాశముందట. చివరి నిమిషంలో ఎలాంటి మార్పులు లేకపోతే వచ్చే నెలలో అధికారిక ప్రకటన వెలువడే ఛాన్స్ ఉందని సమాచారం. సూర్యకుమార్ యాదవ్ గతేడాది మెరుగైన ప్రదర్శన చేయకపోయినప్పటికీ ఈ అనుభవజ్ఞుడైన ఆటగాడిని వదులుకునేందుకు ముంబయి సిద్ధంగా లేదని తెలుస్తోంది. "అవును.. గత సీజన్‌లో సూర్యకుమార్ బాగా ఆడలేదు. కానీ, అంతకు ముందు సీజన్ల సంగతేంటి? కేవలం ఒక ఏడాది ప్రదర్శన ఆధారంగా ముంబయి ఇండియన్స్ ఒక ఆటగాడిని పక్కనపెట్టదు. వారు ఆ విధంగా వ్యవహరించరు. వాళ్లు 'వన్ ఫ్యామిలీ' అనే ట్యాగ్‌ను గర్వంగా భావిస్తారు. దానికే కట్టుబడి ఉంటారు" అని సంబంధిత వర్గాలు తెలిపాయి.




## అఫ్గాన్‌తో టీ20 సిరీస్.. భారత జట్టు ఇదే..

అఫ్గానిస్థాన్‌తో ఈ నెల 13 నుంచి ప్రారంభం కానున్న టీ20 సిరీస్‌కు సంబంధించి భారత జట్టును బీసీసీఐ సెలక్షన్ కమిటీ ప్రకటించింది. భారత స్టార్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా తిరిగి జట్టులోకి వచ్చాడు. గాయంతో చాన్నాళ్లుగా జట్టుకు దూరమైన ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యను జట్టులోకి తీసుకోలేదు. అతడి కాలికి మరోసారి గాయం కావడంతోనే జట్టులోకి తీసుకోలేదని సమాచారం. శ్రేయస్ అయ్యర్ జట్టుకు నాయకత్వం వహించనున్నాడు. తెలుగు కుర్రాడు తిలక్ వర్మ వైస్ కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. జింబాబ్వే పర్యటనలో రాణించిన యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. జింబాబ్వే సిరీస్‌కు దూరమైన సంజూ శాంసన్, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, రవి బిష్ణోయ్, అర్ష్‌దీప్‌సింగ్, హర్షిత్ రాణా తిరిగి జట్టులోకి వచ్చారు. బుమ్రా, నితీశ్, వాషింగ్టన్ సుందర్, హర్షిత్ రాణా సెలక్ట్ అయినప్పటికీ వారికి ఫిట్‌నెస్ క్లియరెన్స్ రావాల్సి ఉంది. గత జింబాబ్వే సిరీస్‌లో ఆడిన ఎనిమిది మంది ప్లేయర్లు.. సూర్యాంశ్ షెడ్గే, రింకూ సింగ్, హర్ష్ దూబె, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, అశోక్ శర్మ, మయాంక్ యాదవ్, ప్రభ్‌సిమ్రన్ సింగ్ ఈ సిరీస్‌కు ఎంపిక కాలేదు. దిల్లీ వేదికగా అఫ్గాన్‌తో భారత్ మూడు టీ20లు ఆడనుంది. సెప్టెంబర్ 13, 15, 17 తేదీల్లో ఈ మ్యాచ్‌లు జరుగుతాయి.



భారత జట్టు: శ్రేయస్ అయ్యర్, అభిషేక్ శర్మ, వైభవ్ సూర్యవంశీ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ, శివమ్ దూబె, నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, హర్షిత్ రాణా

# అన్ని ఫార్మాట్ల పేసర్‌గా ఎదగాలన్నదే నా లక్ష్యం: గుర్నూర్ బ్రార్

సీనియర్ పేసర్లు బుమ్రా, సిరాజ్‌లతో కలిసి బౌలింగ్ చేయడం వల్ల బంతిని సరైన లెంగ్త్‌లో వేయడంలో స్థిరత్వం సాధించానని భారత ఫాస్ట్ బౌలర్ గుర్నూర్ బ్రార్ అన్నాడు. ఎక్కువ పనిభారాన్ని మోయగల అన్ని ఫార్మాట్ల పేసర్‌గా ఎదగాలని లక్ష్యంగా పెట్టుకున్నానని గుర్నూర్ పేర్కొన్నాడు. ఇప్పటివరకు ఆరు వన్డేలు ఆడిన ఇతను 6.96 ఎకానమీతో 11 వికెట్లు తీసి అంతర్జాతీయ కెరీర్‌ను అద్భుతంగా ఆరంభించాడు. "రంజీ ట్రోఫీ, ఇండియా 'ఎ' తరఫున నేను కనబరిచిన ప్రతిభ కారణంగానే భారత జట్టుకు ఎంపికయ్యా. అయితే, బౌలింగ్‌లో 'లెంగ్త్' విషయంలో స్థిరత్వాన్ని ఎలా సాధించాలి, అలాగే పిచ్ పరిస్థితులకు అనుగుణంగా ఏ బ్యాటర్‌కు ఎలా బౌలింగ్ చేయాలి అనే విషయాలపై మరింత అవగాహన పెంచుకుంటున్నా. మొదటి నుంచీ నాకు ఒకే ఒక లక్ష్యం ఉంది. ఎన్ని ఓవర్లు వేసినా ఎలాంటి ప్రభావం పడనంతగా శరీరాన్ని దృఢంగా తీర్చిదిద్దుకోవాలి. మోర్నీ (మోర్కెల్), గంభీర్ సర్‌ల సలహాలతో నా బౌలింగ్‌లో చాలా మార్పు కనిపించింది. బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణలను కలిసి వారి బౌలింగ్‌ను నిశితంగా పరిశీలించా. నేను కూడా వారిలా అన్ని ఫార్మాట్ల బౌలర్‌గా మారడానికి ప్రయత్నిస్తున్నా"నని గుర్నూర్ బ్రార్ పేర్కొన్నాడు. గుర్నూర్ ప్రస్తుతం నార్త్‌జోన్ తరఫున దులీప్ ట్రోఫీ సెమీస్‌లో ఆడుతున్నాడు. సౌత్‌జోన్‌తో జరుగుతున్న సెమీస్‌లో తొలి ఇన్నింగ్స్‌లో నాలుగు వికెట్లు పడగొట్టాడు.



# ఆ ఇద్దరి వల్లే పాక్ క్రికెట్ పతనం.. ఆటగాళ్లు, బోర్డుపై మాజీల మండిపాటు

లాహోర్: ఇంగ్లాండ్‌తో మూడు టెస్టుల సిరీస్‌లో పాకిస్థాన్ జట్టు పేలవ ప్రదర్శన చేస్తోంది. తొలి రెండు టెస్టుల్లో ఓటమిపాలైన పాక్.. నాలుగు ఇన్నింగ్స్‌ల్లో ఒక్కసారి కూడా 200కుపైచిలుకు స్కోరు చేయలేదు. ఆ జట్టు పరిస్థితి ఎంత దారుణంగా ఉందో దీన్ని బట్టి చెప్పొచ్చు. ఈ నేపథ్యంలో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ)పై, ఆటగాళ్లపై మాజీలు మండిపడుతున్నారు. 70 ఏళ్లలో అత్యంత చెత్త బోర్డు ఇదేనని మాజీ క్రికెటర్ రషీద్ లతీఫ్ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించాడు. "ప్రతి ఒక్కరూ మన క్రికెట్ టీమ్ గురించే మాట్లాడుతున్నారు. అత్యంత చెత్త టీమ్ ఇదే. ఇక్కడ మనం బోర్డు గురించి కూడా చర్చించాలి. ఎందుకంటే, ఆటగాళ్లను ఎంపిక చేసే సెలక్షన్ కమిటీ, కోచ్‌లను నియమించేది బోర్డే కదా. జట్టు



నాశనం కావడానికి ప్రధాన కారణం ఆ బోర్డే' అని లతీఫ్ ఆరోపించాడు.

**ఆ ఇద్దరి వల్లే**

షాహీన్ షా అఫ్రిది, బాబర్ అజామ్ మధ్య ఏర్పడిన విభేదాలే పాక్ క్రికెట్ పతనానికి కారణమని ఆ దేశ మాజీ బ్యాటర్ బాసిత్ అలీ విమర్శించాడు. కెప్టెన్సీ విషయంలో వీరిద్దరి మధ్య తలెత్తిన వివాదం జాతీయ జట్టు పరిస్థితి దిగజారడానికి నాంది పలికిందన్నాడు. "బాబర్ అజామ్ బలమైన కెప్టెన్ కాదు. ఇంగ్లాండ్‌లో ప్రదర్శన ఆధారంగా నేను ఈ మాట అనడం లేదు. అతను అనేక తప్పుడు నిర్ణయాలు తీసుకున్నాడు. కెప్టెన్సీ విషయంలో షాహీన్, బాబర్ మధ్య విభేదాలు తలెత్తిన రోజు నుంచే పాకిస్థాన్ క్రికెట్ పతనం మొదలైంది" అని బాసిత్ అలీ ఆరోపించాడు.

**భారీ మార్పులు**

తొలి రెండు టెస్టుల్లో ఆ జట్టు ఘోర పరాజయం పాలవడంతో.. సిరీస్‌లో ఆఖరిదైన మూడో మ్యాచ్‌కు పాకిస్థాన్ జట్టులో భారీ మార్పులు చేసింది. ఏడుగురు ఆటగాళ్లను జట్టు నుంచి తప్పించింది. వారి స్థానంలో కొత్త ప్లేయర్లను ప్రకటించింది. ఒక సిరీస్ మధ్యలో జట్టులో ఒకేసారి ఇన్ని మార్పులు చేయడం అరుదు. మహ్మద్ రిజ్వాన్, ఇమాముల్ హక్, సల్మాన్ ఆఘా, అలీ ఉస్మాన్, ఆమిర్ జమాల్, మహ్మద్ అవైస్, ఖుర్రమ్ షెహజాద్ టీమ్‌లో చోటు కోల్పోయారు. వారి స్థానాల్లో సయీమ్ ఆయూబ్, అబ్దుల్లా ఫజల్, అరాఫత్ మిన్హాస్, సాద్ బైగ్, మహ్మద్ రంధావా, రజావుల్లా, మహ్మద్ ఇమ్రాన్ జూనియర్ అవకాశం దక్కించుకున్నారు. ప్రధాన కోచ్ సర్ఫరాజ్ అహ్మద్, బౌలింగ్ కోచ్ ఉమర్ గుల్‌లకూ ఉద్వాసన తప్పలేదు. వారికి బదులు మైక్ హెసన్, ఆష్లీ నాఫ్కె బాధ్యతలు చేపట్టనున్నారు. పాకిస్థాన్, ఇంగ్లాండ్ మధ్య ఆఖరి టెస్టు ఈ నెల 9న మొదలుకానుంది.



# ఓటీటీలోకి విశ్వనాథ్ అండ్ సన్స్




సూర్య, మమితా బైజు హీరోహీరోయిన్లుగా నటించన విశ్వనాథ్ అండ్ సన్స్ ఓటీటీ డేట్ ఫిక్సయింది. థియేటర్లలో రిలీజైన నెల రోజుల తర్వాత సెప్టెంబర్ 14 నుంచి నెట్‌ఫ్లిక్స్‌లో స్ట్రీమింగ్ కాబోతుంది. తమిళంతో పాటు తెలుగు భాషలోనూ విడుదలవుతోంది. ఓ జంట ప్రేమకథకు ఏజ్ గ్యాప్ ఎలా అడ్డంకిగా మారిందనే కాన్సెప్ట్‌కు ఫ్యామిలీ ఎమోషన్స్, సరోగసీ అంశాలను జోడించి దర్శకుడు వెంకీ అట్లూరి ఈ సినిమాను తెరకెక్కించారు. సూర్య, మమితా బైజు యాక్టింగ్, కథ, కామెడీ ఆడియెన్స్‌ను మెప్పించాయి. సూర్యదేవర నాగవంశీ ఈ సినిమాను నిర్మించగా జీవీ ప్రకాష్ కుమార్ మ్యూజిక్ అందించారు.

# మైసా రిలీజ్ డేట్ వచ్చేసింది

రష్మిక మందన్న హీరోయిన్‌గా నటిస్తోన్న లేడీ ఓరియెంటెడ్ మూవీ మైసా రిలీజ్ డేట్ ఖరారైంది. నవంబర్ 27న ఈ మూవీ థియేటర్లలోకి రాబోతుంది. రిలీజ్ డేట్‌ను రివీల్ చేస్తూ మేకర్స్ మంగళవారం ఓ కొత్త పోస్టర్‌ను రిలీజ్ చేశారు. ఈ పోస్టర్‌లో చేతిలో ఈటె పట్టుకొని యోధురాలిగా రష్మిక కనిపిస్తోంది. ఓ చేతికి కడియాలు, మరో చేతికి బేడీలు ఉండటం ఆసక్తిని పంచుతోంది. రష్మిక వెనుక కొడవళ్లు పట్టుకొని చాలా మంది మహిళలు ఉన్నారు. భయం లేని మార్గాన్ని ఆమె ఎంచుకుంది. చెక్కుచెదరని ఆత్మ విశ్వాసం మైసా సొంతం అంటూ రిలీజ్ డేట్‌కు ఓ క్యాప్షన్‌ను మేకర్స్ జోడించారు. ఈ మూవీకి రవీంద్ర పుల్లే దర్శకత్వం వహిస్తుండగా జేక్స్ బిజోయ్ మ్యూజిక్ అందిస్తున్నారు.




## టాక్సిక్‌కు రేటింగ్..
# నెటిజన్ల ట్రోల్స్



యశ్ టాక్సిక్ మూవీకి మహేష్‌బాబు తనయుడు గౌతమ్ ఘట్టమనేని 0.5 రేటింగ్ ఇవ్వడంపై కన్నడ ఫ్యాన్స్ ఫైర్ అవుతోన్నారు. సినిమా నచ్చకపోతే సైలెంట్‌గా ఉండాలని, ఇలా నెగెటివ్ ప్రచారం చేయద్దని అంటున్నారు. ఎలాంటి బ్యాక్‌గ్రౌండ్ లేకుండా యశ్ ఈ స్థాయికి చేరుకున్నాడని, మహేష్‌బాబులా వారసత్వంతో సినిమాల్లోకి అడుగు పెట్టలేదంటూ కామెంట్లు పెడుతోన్నారు. మరోవైపు టాలీవుడ్ ఫ్యాన్స్ గౌతమ్‌కు సపోర్ట్‌గా నిలుస్తున్నారు. మహేష్‌బాబు సినిమాలూ నచ్చకపోతే గౌతమ్ తక్కువే రేటింగ్ ఇచ్చాడని అంటున్నారు. కాగా గౌతమ్‌కు చెందిన సినిమా రేటింగ్ ప్లాట్‌ఫామ్ లెటర్‌బాక్స్ ప్రొఫైల్ ఫొటో సోషల్ మీడియాలో ప్రస్తుతం చక్కర్లు కొడుతోంది. ఇందులో వివిధ భాషల్లో తాను చూసిన సినిమాలకు గౌతమ్ రేటింగ్ ఇచ్చాడు.

# యూనియన్‌ను చీలిస్తే ఊరుకోం



తెలుగు ఫిల్మ్ అండ్ టీవీ డ్యాన్సర్స్ అండ్ డ్యాన్స్ డైరెక్టర్స్ అసోసియేషన్ (TFTDDA)లో నెలకొన్న అంతర్గత విభేదాలపై అధ్యక్షురాలు సుమలత స్పందించారు. రఘు మాస్టర్ ఆధ్వర్యంలో కొత్త కార్యవర్గాన్ని కొందరు డ్యాన్సర్లు ప్రకటించారు. దానికి చట్టబద్ధత లేదు. మా అసోసియేషన్‌తో ఎలాంటి సంబంధం లేదు. మా కార్యవర్గానికి ఎలాంటి లీగల్ నోటీసు రాలేదు. అయినా మా కార్యవర్గాన్ని నాన్ ఆఫీషియల్ అని ఎలా ప్రకటిస్తారు? అసోసియేషన్‌లో గతంలో జరిగినట్లు చెబుతున్న 36 లక్షల రూపాయల అవినీతికి సంబంధించిన నివేదికను ఇప్పటివరకు ఎందుకు ఇవ్వలేదు. మేం నిబంధనల ప్రకారమే ముందుకు వెళ్తున్నాం. మాకు ఫెడరేషన్, ఫిల్మ్ ఛాంబర్ మద్దతుగా ఉండాలి. ఈ సమస్యను మెగాస్టార్ చిరంజీవి, సురేష్ బాబు, దిల్ రాజు వంటి సినీ పెద్దలు పరిష్కరించాలి. యూనియన్ కార్యకలాపాలను అడ్డుకోవాలని చూస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తాం అని సుమలత హెచ్చరించారు.

# ఆర్ట్ డైరెక్టర్ కొడుకు అరెస్ట్

హిట్ అండ్ రన్ కేసులో టాలీవుడ్ ఆర్ట్ డైరెక్టర్ ఆనంద్ సాయి కుమారుడు అరెస్ట్ అయ్యాడు. కారుతో ఓ వ్యక్తిని ఢీ కొట్టడమే కాకుండా ఆపకుండా వెళ్లిపోయిన ఆనంద్ సాయి కుమారుడు సందీప్‌పై రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేశారు. ఓ ప్రమాదంలో గాయపడిన నందులాల్‌ను జైషా ఖాద్రీ అనే స్టూడెంట్ హాస్పిటల్‌కు తీసుకెళుతుండగా.. వారిద్దరిని సందీప్ తన మహీంద్ర ఈవీ కారుతో బలంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో నందులాల్ అక్కడికక్కడే మరణించగా యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రమాదం తర్వాత కారు ఆపకుండా సందీప్ వెళ్లిపోయినట్లు సమాచారం. సీసీ ఫుటేజీ ఆధారంగా గుర్తించిన రాయదుర్గం పోలీసులు సందీప్‌ను అరెస్ట్ చేశారు.







## హారర్ కామెడీ మూవీతో
# జేజమ్మ రీఎంట్రీ

దాదాపు రెండేళ్ల తర్వాత అనుష్క తెలుగులో ఓ సినిమా చేయబోతోంది. ఓ హారర్ కామెడీ మూవీతో టాలీవుడ్‌లోకి కమ్‌బ్యాక్ ఇవ్వబోతున్నట్లు సమాచారం. అనుష్క రీఎంట్రీ సినిమాకు జాతిరత్నాలు ఫేమ్ కేవీ అనుదీప్ దర్శకత్వం వహించబోతున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. హారర్, కామెడీ రెండింటిని బ్యాలెన్స్ చేస్తూ అనుదీప్ రాసిన కథ నచ్చడంతో జేజమ్మ ఈ సినిమాకు ఒకే చెప్పినట్లు సమాచారం. టాలీవుడ్ టాప్ ప్రొడక్షన్ హౌజ్ ఈ సినిమాను నిర్మించబోతున్నట్లు టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం కథనార్ పేరుతో మలయాళంలో అనుష్క ఓ సినిమా చేస్తోంది. హారర్ ఫాంటసీ థ్రిల్లర్‌గా తెరకెక్కుతోన్న ఈ మూవీతోనే మాలీవుడ్‌లోకి తొలి అడుగు వేయబోతుంది.